www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -147 గురువారం 10 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## అసెంబ్లీ సంఘటనలపై

# సిట్ వేస్తాం

### ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర..

**బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారు**

**స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదు**

**ఘటనలపై సమగ్ర విచారణ జరిపిస్తాం**

**అందరినీ శిక్షించేలా పూర్తిస్థాయి విచారణ**

**కేసీఆర్‌పై అసెంబ్లీలో రేవంత్ ఆరోపణలు**

**హైదారాబాద్, సెప్టెంబర్ 09 (ప్రజావినికిడి):**
అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై మాటల దాడికి పాల్పడటం పార్లమెంట్, ముంబయి, పుల్వామా దాడులతో సమానమని వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు. శాసనసభలో బుధవారం మాట్లాడిన సీఎం.. స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్‌ను దూషించిన ఘటనను సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఇలాంటి ఘటన తర్వాత కేసీఆర్ స్వయంగా స్పీకర్‌తో మాట్లాడి క్షమాపణలు చెబుతారని ప్రజాస్వామ్యవాదులు భావించారని అన్నారు. కానీ కేసీఆర్ అలా చేయలేదని విమర్శించారు. ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమస్యలు చర్చకు వస్తే తమ గుట్టు రట్టవుతుందనే భయంతోనే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ కుట్రకు తెరతీశారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపి సభకు పంపించారని మండిపడ్డారు. ఎక్కడైతే ఈ కుట్రకు తెరలేచిందని ఆరోపించారో.. అదే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి డప్పులు వాయించేందుకు ప్రయత్నిస్తే అక్కడ శుద్ధీకరణ చేశారని రేవంత్ అన్నారు. ఉత్తరాఖండ్‌లో ఖర్గే నిరసనలో పాల్గొన్న మైదానాన్ని శ్రీరామసేన శుద్ధీకరణ చేసిందని గుర్తుచేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటన తెలంగాణలోనూ

మిగతా 2లో.



## 10వేల కోట్లతో

# రైల్వే కారిడార్లు



**దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్**

**ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్**

**నాలుగు పరిధిలో 5 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు**

**దక్షిణాదిలో 5, ఉత్తరాదిలో 3 ప్రాజెక్టులు**

**7 రైల్వే కారిడార్లలో 4 లేన్ల ట్రాక్ నిర్మాణం**

**తెలుగు రాష్ట్రాలకు భారీ ప్రయోజనం**

**4,790 గ్రామాలకు రవాణా సదుపాయాలు**

**పెరిగనున్న రైళ్ల రాకపోకల సామర్థ్యం**

**రైల్వేపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు**

**మీడియాకు వెల్లడించిన అశ్విని వైష్ణవ్**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 09, (ప్రజావినికిడి):**
రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని రద్దీ మార్గాలతో సహా దేశవ్యాప్తంగా పలు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం మీడియాకు వెల్లడించారు. కేబినెట్ నిర్ణయం ప్రకారం, తెలంగాణలోని ఘట్‌కేసర్–కాజీపేట సెక్షన్‌లో నాలుగో లైను నిర్మాణానికి ఆమోదం లభించింది. 110 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు రూ. 2,419 కోట్లు అవుతుందని అంచనా ఉంది.

మిగతా 2లో.

## ఏపీలో స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఖరారుకు

# షెడ్యూల్ విడుదల

**సెప్టెంబర్ 11న ఫొటో సహిత ఓటర్ల జాబితా ప్రదర్శన**

**15వ తేదీన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా రూపకల్పన**

**19న ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ కేంద్రాల తుది జాబితా రూపకల్పన**



**అమరావతి సెప్టెంబరు 09 (ప్రజావినికిడి):**
ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం వడివడిగా అడుగులు వేస్తోంది. రాబోయే ఎన్నికలకు సంబంధించి ఫొటోలతో కూడిన పూర్తిస్థాయి ఓటర్ల జాబితాలను తక్షణమే సిద్ధం చేయాలని

మిగతా 2లో.

# కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదు



**గవర్నర్‌ను కలిసిన కేటీఆర్..**

**1000 రోజులు గడిచినా కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదని విమర్శ**

**తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారని ఫిర్యాదు**

**దాడులకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు అందజేత**

**రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వ వైఫల్యంపై ఆరోపణ**

**హైదరాబాద్ సెప్టెంబరు 09 (ప్రజావినికిడి):**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ ఎమ్మెల్యేల బృందం బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందని ఈ సందర్భంగా వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ఎమ్మెల్యేలపై

మిగతా 2లో.

## ఆ బూతులు భరించలేకనే కడుపు మండి మాట్లాడా!

**: కేసీఆర్ పై వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే శంకర్ వివరణ**

**ఒకరి చావును కోరడం సమర్థనీయం కాదన్న శంకర్**

**సీఎం, స్పీకర్ లను బీఆర్ఎస్ నేతలు దూషిస్తున్నారని మండిపాటు**

**కడుపు మండి మాట్లాడాల్సి వచ్చిందని వ్యాఖ్య**



**హైదరాబాద్ సెప్టెంబరు 09 (ప్రజావినికిడి):**
బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన రాజకీయ దుమారంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. వ్యక్తిగతంగా ఏ ఒక్కరి చావును కోరుకోవడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని ఆయన అంగీకరించారు.

మిగతా 2లో.

## సెప్టెంబర్‌లో సాలకట్ల, అక్టోబర్‌లో

# నవరాత్రి బ్రహ్మోత్సవాలు

**ఉత్సవాల షెడ్యూల్‌తో కూడిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించిన టీటీడీ**

**తిరుమల అన్నమయ్య భవనంలో విడుదల చేసిన చైర్మన్ బీఆర్ నాయుడు**

**ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటన**



2లో.

## శాసనసభ నుంచి బీఆర్ఎస్

# ఎమ్మెల్యేల సస్పెన్షన్







**కేటీఆర్, హరీశ్‌రావుతో సహా 22 మందిపై వేటు**

**సభ్యుల సస్పెన్షన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు**

**సస్పన్షన్ వేటుకు స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆమోదం**

**సెషన్ మొత్తం సస్పెండ్ చేసిన శాసనసభ స్పీకర్**

**హైదారాబాద్, సెప్టెంబర్ 09 (ప్రజావినికిడి):**
బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై శాసనసభలో సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఈ సమావేశాలకు మొత్తంగా బీఆర్?ఎస్? ఎమ్మెల్యేలు దూరంగా ఉండనున్నారు. శాసనసభ సజావుగా

మిగతా 2లో.

## తెలంగాణ పీఆర్‌సీపై ప్రభుత్వం కీలక అడుగు

**పీఆర్‌సీ ప్రక్రియను వేగవంతం చేసే దిశగా కీలక అడుగు**

**నివేదిక త్వరగా ఇవ్వాలని పీఆర్‌సీ ఛైర్మన్‌కు సీఎస్ లేఖ**

**రెండో పీఆర్‌సీ గడువు ముగుస్తున్న నేపథ్యంలో నిర్ణయం**

**బకాయి డీఏల విడుదలపై ఉద్యోగుల నుంచి డిమాండ్లు**

**ఫిట్‌మెంట్ ప్రకటించాలని ఉద్యోగ సంఘాల ఒత్తిడి**



2లో.

# 10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

**మొదటిపేజీ తరువాయి**

అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ మీదుగా సాగే అరక్కోణం-రేణిగుంట మార్గంలో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల పూర్తితో ఆయా మార్గాల్లో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. నాలుగు రాష్ట్రాల్లోని 17 జిల్లాల పరిధిలో నాలుగు లైన్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 10,021 కోట్లుగా కేంద్రం పేర్కొంది. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక పరిధిలో ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు రాబోతున్నాయి. కొత్త లైన్ల నిర్మాణం ద్వారా రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగడమే కాకుండా, సరుకు రవాణా, ప్రయాణికుల రైళ్ల వేగం కూడా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిని 2029-30 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక వేసింది. బుల్లెట్ రైలు ప్రారంభోత్సవం 2027లో జరగనుంది. దీని నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. పనులు డిసెంబర్ నాటికి పూర్తవుతాయి. వచ్చే ఏడాది మే-జూన్ నాటికి టెస్టింగ్? కోసం రైలు పట్టాలపైకి వస్తుంది. టెస్టింగ్? పూర్తయిన తర్వాత ప్రారంభోత్సవం జరుగుతుందని అన్నారు. ఇందులో, అరక్కోణం- రేణిగుంట సెక్షన్‌లో 77 కి.మీ.పొడవుతో 3, 4 లేన్ల నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయం తీసుకుంది. అలాగే, ఘట్‌కేసర్-కాజీపేట మధ్య 110 కి.మీ. పొడవుతో నాలుగో లేన్ నిర్మాణానికి రూ.2,419 కోట్లతో ఆమోదం లభించింది. దీంతో పాటు వైట్‌ఫీల్డ్-బంగారుపేట మధ్య 47 కిలోమీటర్ల పొడవుతో 3, 4 లైన్ల నిర్మాణం, 159 కిలోమీటర్ల మేర సేలం-కరూర్-దుండిగల్ డబ్లింగ్, 147 కిలోమీటర్ల మేర హోసూర్-ఒమలూరు డబ్లింగ్‌కు ఆమోదం లభించింది.ఈ ప్రాజెక్టుల నిర్మాణంతో రైళ్ల రాకపోకల సామర్థ్యం పెరిగి, రద్దీ తగ్గనున్నట్లు ప్రభుత్వం అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా ఉన్న అనేక ప్రముఖ పర్యటక ప్రదేశాలకు రైలు మార్గాలు మెరుగుపడనున్నట్లు తెలిపింది. తారాతరిణి ఆలయం, జగన్నాథ ఆలయం(ఝూర్సుగూడ సమీపంలోని పురాతన ఆలయం), బంధవ్‌గఢ్ టైగర్ రిజర్వ్, అమర్‌కంటక్ ఆలయం, అచానక్‌మార్ టైగర్ రిజర్వ్ వంటి ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రాలకు రైలు కనెక్టివిటీ పెరుగుతుందని అంచనా వేసింది. దీంతో పాటు సరుకు రవాణాకు కూడా ఈ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగపడనున్నాయి. ముఖ్యంగా బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు వంటి సరుకుల రవాణా సులుభతరం కానుంది. దీనివల్ల ఏడాదికి అదనంగా సుమారు 47 మిలియన్ టన్నుల సరుకు రవాణాకు మార్గం సులభతరం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. సమగ్ర ప్రణాళిక, భాగస్వాముల సంప్రదింపుల ద్వారా బహుళ- రవాణా అనుసంధానాన్ని, లాజిస్టిక్ సామర్థ్యాన్ని పెంపొందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. పీఎం గతి శక్తి నేషనల్? మాస్టర్ ప్లాన్ ఆధారంగా ఈ ప్రాజెక్టులు ప్రణాళిక రచించారు. ఈ ప్రాజెక్టులు ప్రజలు, వస్తువులు, సేవల రవాణాకు నిరంతరాయ అనుసంధానాన్ని అందిస్తాయని ప్రభుత్వం అభిప్రాయపడింది. రైల్వే నెట్‌వర్క్ పెరగడం వల్ల దేశంలో చమురు దిగుమతులు తగ్గుతాయని అభిప్రాయపడింది. దాదాపు 12 కోట్ల లీటర్ల చమురు దిగుమతి ఆదా అవుతుందని తెలిపింది. అలాగే, 62 కోట్ల కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయని పేర్కొంది.

# అసెంబ్లీ సంఘటనలపై సిట్ వేస్తాం

**మొదటిపేజీ తరువాయి**

చోటుచేసుకుందని వ్యాఖ్యానించారు. స్పీకర్ స్థానాన్ని అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని సీఎం పేర్కొన్నారు. సభలో సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజాసమస్యలపై చర్చకు సహకరించాలని కోరారు.అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నామని, డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తామని స్పష్టం చేశారు. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ చేస్తామని, క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో నిన్న కేసీఆర్ ఫామ్‌హౌస్ రోడ్డును శుద్ధీకరణ చేశారని, ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేలతో మీటింగ్ పెట్టిన విపక్షనేత కేసీఆర్ చేసిన కుట్ర ఇదేనా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ముందు విధుల్లో ఉన్న మహిళా ఉద్యోగులను ఇబ్బంది పెట్టారని, దళితుడైన సభాపతిని ఘోరమైన పదంతో దూషించారని ఆరోపించారు. రాజకీయంగా ఎన్ని విభేదాలైనా ఉండొచ్చని, కానీ తల్లిని అవమానిస్తారా? నిలదీశారు. సభాపతికి క్షమాపణలు చెప్పి తప్పును సరిదిద్దుకోవాలని అన్ని పార్టీలు సూచించాయని గుర్తు చేశారు.అంటరానితనం ప్రదర్శించిన వారిపై విచారణకు ఆదేశిస్తున్నాం. కుట్రలు చేసిన వారిని, అమలు చేసిన వారిని కోర్టు ముందు దోషులుగా నిలబెడతాం. అంటరానితనం ఘటనపై విచారణ అధికారిగా విజయ్‌కుమార్‌ను నియమిస్తున్నాం. విచారణాధికారిగా హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్‌ను నియామిస్తున్నాం. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నాం. డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తాం. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటాం.కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ జరుగుతుంది. క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటాం. ఫామ్‌హౌస్‌లో భేటీ మొదలుకుని వరుస ఘటనలపై విచారణ జరిపిస్తామని అన్నారు. దళిత సభాపతిని అవమానించినందుకు అందరి మనోభావాలు దెబ్బతిన్నాయని, స్పీకర్‌ను దూషించడాన్ని ఖండిస్తూ ఎస్సీ ప్రజలు డప్పులతో నిరసన తెలిపారని సీఎం పేర్కొన్నారు. ఎక్కడ కుట్ర జరిగిందో అక్కడ డప్పు మోగించి వాళ్ల నిరసన తెలిపారని, ఫామ్‌హౌస్‌కు చాలా దూరంలో డప్పు కొట్టారే తప్ప ఎవరినీ తిట్టలేదు, దాడి చేయలేదని స్పష్టం చేశారు. దళిత సమాజానికి క్షమాపణలు చెప్పాలని మాత్రమే వారు కోరారని, వారికి కేసీఆర్ క్షమాపణలు చెప్పకుండా మరో కుట్రకు ఆదేశించారని వెల్లడించారు. కేసీఆర్ ఆదేశాల మేరకే శుద్ధి చేశామని బీఆర్ఎస్ నేత సంధ్యారావు పోస్టు చేశారని, పదేళ్లు సీఎంగా ఉండి విజ్ఞత కలిగిన నాయకుడు ఇలా చేస్తారా? ప్రశ్నించారు. శుద్ధి చేయాల్సింది నేలను కాదని, అంటరానితనం ఆలోచనలను శుద్ధి చేయాలని, తరతరాలుగా వాళ్ల మనసుల్లో ఉన్న కుళ్లు, అంతరాలను శుద్ధి చేయాలని హితవు పలికారు. దళితులు నడిచారని నేలను శుద్ధి చేయించిన దొర అహంకారాన్ని శుద్ధి చేయాలని, దళితులను అవమానించిన ప్రతి ఒక్కరిని చట్టపరంగా కూడా శిక్షిస్తామని హెచ్చరించారు. మల్లికార్జున ఖర్గే, ప్రసాద్‌కుమార్‌కు జరిగిన అవమానాలు వ్యక్తులకు జరిగినవి కాదని, కులవివక్ష, అణచివేత చర్యలను ప్రజా ప్రభుత్వం ఉపేక్షించదని స్పష్టం చేశారు.

,..................

# సెప్టెంబర్‌లో సాలకట్ల, అక్టోబర్‌లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు

**ఉత్సవాల షెడ్యూల్‌తో కూడిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించిన టీటీడీ**

**తిరుమల సెప్టెంబరు 09 (ప్రజావినికిడి):**
కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల తేదీలను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఖరారు చేసింది. 2026 సంవత్సరానికి గాను సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించింది. ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ ఇప్పటి నుంచే ఏర్పాట్లను ముమ్మరం చేస్తోంది.

ఈ ఏడాది సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. సెప్టెంబరు 15న సీఎం చంద్రబాబు స్వామివారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

ఈ ఉత్సవాలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, పాలకమండలి సభ్యులు బుధవారం తిరుమలలో ఆవిష్కరించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశం సందర్భంగా ఈ బుక్‌లెట్‌ను విడుదల చేశారు. బ్రహ్మోత్సవాల సమయంలో జరిగే వాహన సేవలు, ఇతర ముఖ్య కార్యక్రమాల వివరాలను భక్తులకు సులభంగా తెలియజేసేందుకు దీనిని రూపొందించినట్లు బీఆర్ నాయుడు తెలిపారు.

ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. శ్రీవారి బ్రహ్మోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ అన్ని ఏర్పాట్లు చేస్తోందని స్పష్టం చేశారు. ఉత్సవాలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ద్వారా కూడా బ్రహ్మోత్సవాల వివరాలను పంచుకున్నారు. టీటీడీ ప్రకటనతో శ్రీవారి భక్తుల్లో బ్రహ్మోత్సవాల సందడి మొదలైంది.

# ఆ బూతులు భరించలేకనే కడుపు మండి మాట్లాడా!

**మొదటిపేజీ తరువాయి**

అయితే, సభలోనూ బయటా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, దళిత వర్గానికి చెందిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను, మహిళా మంత్రులను బీఆర్ఎస్ నేతలు అత్యంత అసభ్యకరంగా, కులాల పేరుతో దూషిస్తూ లక్ష్మణరేఖ దాటుతున్నారని ఆరోపించారు.

ప్రతిపక్ష నేతల బూతులు వినలేక టీవీలు చూస్తున్న మహిళలు చెవులు మూసుకుంటున్నారని, బీఆర్ఎస్ నేతలు వారి సొంత కుటుంబ సభ్యులు కూడా తలదించుకునేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే అసెంబ్లీకి రాకుండా దూరంగా ఉంటున్న కేసీఆర్ వెంటనే సభకు వచ్చి ప్రజా సమస్యలపై చర్చలో పాల్గొనాలని కోరే క్రమంలో కడుపు మండి మాట్లాడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలదని, కేసీఆర్ కుటుంబానికి మాత్రమే సొంతం కాదని వ్యాఖ్యానించారు.

ఇదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఖరిని కూడా ఎమ్మెల్యే శంకర్ తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఉద్దేశించి, "ఎక్కడ సచ్చిందు రాహుల్ గాంధీ?" అంటూ మూడు రోజుల క్రితం కరీంనగర్ పర్యటనలో కేటీఆర్ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లను ఆయన మీడియా సమక్షంలో ప్రదర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలపై అంతటి దిగజారుడు పదజాలాన్ని ఉపయోగించిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు తమకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

# ఈ20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన.. కేంద్రానికి మద్దతు

**పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదన్న మంత్రి పొన్నం ప్రభాకర్**

**తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అసెంబ్లీలో వెల్లడి**

**ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వాదనకు తెలంగాణ మద్దతు**



**హైదరాబాద్ సెప్టెంబరు 09, (ప్రజావినికిడి):**
ఇథనాల్ కలిపిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలో తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన శాసనసభలో వెల్లడించారు.

ఈ20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవుతున్నట్లు వాహన యజమానుల నుంచి గానీ, ఆటోమొబైల్ రంగ నిపుణుల నుంచి గానీ రవాణా శాఖ దృష్టికి ఎటువంటి సమాచారం రాలేదని మంత్రి తెలిపారు. "ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించి మా వద్ద ఎటువంటి ప్రతికూల నివేదికలు లేవు. అందువల్ల, దీనిపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసే లేదా నియంత్రణ చర్యలు చేపట్టే ఆస్కారం లేదు" అని ఆయన వివరించారు.ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే ఏకీభవించారు. గత జూలైలో కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి సైతం లోక్‌సభలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇథనాల్ కలిపిన ఇంధనంతోనే నడుస్తున్నాయని, ఇంజన్ వైఫల్యాలపై ఎటువంటి నిర్దిష్ట ఫిర్యాదులు రాలేదని ఆయన వెల్లడించారు.

గతంలో సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్), ఈ20 ఇంధనంలోని అధిక తేమ, క్లోరైడ్ స్థాయిల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పెట్రోలియం మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. అయితే, ఈ అంశంపై మరింత ధ్రువీకరణ అవసరమని పేర్కొంటూ తదనంతరం ఆ లేఖను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఈ20 ఇంధనం వల్ల వాహనాలకు ఎలాంటి ముప్పు లేదనే అభిప్రాయంతో ఉన్నాయి.

## ఏపీలో స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఖరారుకు షెడ్యూల్ విడుదల

**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో ఎటువంటి లోపాలకు తావులేకుండా పక్కాగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

**ఎన్నికల సంఘం షెడ్యూల్ వివరాలు:**

సెప్టెంబర్ 11: ఫొటో సహిత ఓటర్ల జాబితాల ప్రదర్శన
సెప్టెంబర్ 14: పోలింగ్ కేంద్రాల ముసాయిదా (ఐతీఖట్) జాబితా రూపకల్పన
సెప్టెంబర్ 15: పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా అధికారిక ప్రచురణ
సెప్టెంబర్ 15, 16: పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు, మార్పులు-చేర్పుల వినతుల స్వీకరణ
సెప్టెంబర్ 16: రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల కమిషన్ అధికారుల సమన్వయ సమావేశం
సెప్టెంబర్ 18: పోలింగ్ స్టేషన్ల జాబితాకు జిల్లా కలెక్టర్ల ఆమోదం
సెప్టెంబర్ 19: ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రచురణ.

# కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ

**మొదటిపేజీ తరువాయి**

పోలీసులు దాడులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, అందుకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు సమర్పించారు.అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనకు నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు.

వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

# తెలంగాణ పీఆర్‌సీపై ప్రభుత్వం కీలక అడుగు

**హైదరాబాద్ సెప్టెంబరు 09, (ప్రజావినికిడి):**
తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కీలక చర్య చేపట్టింది. 2వ వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) నివేదికను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోరారు. ఈ మేరకు రెండో పీఆర్సీ ఛైర్మన్ ఎన్. శివశంకర్‌కు లేఖ రాశారు.గతంలో నియమించిన రెండో వేతన సవరణ కమిషన్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పీఆర్సీ అమలుపై ఉద్యోగ సంఘాల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. బకాయి ఉన్న డీఏలు విడుదల చేయాలని, పీఆర్సీ నివేదిక ఆధారంగా ఫిట్‌మెంట్ ప్రకటించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.ఈ అంశాలపై ఉద్యోగులు ఆందోళన బాట పట్టడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. పీఆర్సీ కమిషన్ వేగంగా నివేదిక సమర్పిస్తే.. దాని ఆధారంగా ఉద్యోగుల వేతన సవరణపై తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.కమిషన్ నివేదిక అందిన తర్వాత ఫిట్‌మెంట్, వేతన సవరణకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీంతో పీఆర్సీ ప్రక్రియపై ఉద్యోగుల్లో మరోసారి ఆశలు నెలకొన్నాయి.

## 'నిజం గెలిచింది' నినాదంతో నిరసన తెలిపిన నారా లోకేశ్

**53 రోజుల నిర్బంధానికి గుర్తుగా 53 కొవ్వొత్తులు వెలిగింపు**

**జగన్ కుట్రపూరితంగా తప్పుడు కేసు పెట్టారని లోకేశ్ ఆరోపణ**

**ఉండవల్లి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమ ఫొటోలు సోషల్ మీడియాలో షేర్**



తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు జరిగి నేటికి సరిగ్గా మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఏపీ మంత్రి, టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ నిరసన తెలిపారు. 'నిజం గెలిచింది' అనే నినాదంతో ఉండవల్లిలోని తన నివాసంలో 53 కొవ్వొత్తులు వెలిగించి, నాటి ఘటనను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు.ఈ సందర్భంగా నారా లోకేశ్ స్పందిస్తూ.. మూడేళ్ల క్రితం ఇదే రోజున నాటి ముఖ్యమంత్రి జగన్ రాజకీయ దురుద్దేశంతో, కుట్రపూరితంగా తప్పుడు కేసు బనాయించి చంద్రబాబును అర్ధరాత్రి అరెస్టు చేయించారని ఆరోపించారు. ఆ కేసులో చంద్రబాబును 53 రోజుల పాటు అక్రమంగా జైలులో నిర్బంధించారని ఆయన పేర్కొన్నారు. ఆ చీకటి రోజులకు గుర్తుగా, నాటి నిర్బంధాన్ని నిరసిస్తూ 53 కొవ్వొత్తులు వెలిగించినట్లు లోకేశ్ వివరించారు.నాటి సంఘటన ప్రజాస్వామ్యానికే చీకటి రోజు అని, అయితే చివరికి నిజమే గెలిచిందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ప్రజల ఆశీర్వాదంతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడమే దీనికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.

# శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్


**మొదటిపేజీ తరువాయి**

కొనసాగకుండా అడ్డుకుంటున్న బీఆర్?ఎస్? సభ్యుల సస్పెన్షన్‌కు శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా, స్పీకర్? అనుమతిస్తూ వేటు వేశారు. శాసనసభ నుంచి బీఆర్?ఎస్? ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కోవా లక్ష్మి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజేయుడు, కె.సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానందలపై సస్పెన్షన్ వేటు పడింది. మూడో రోజు సభ ప్రారంభమైన వెంటనే 'వి వాంట్ జస్టిస్' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసన సభా కార్యకలాపాలకు అడ్డు తగిలారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించారు. దీంతో వారిని సభ నుంచి సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. దీంతో స్పీకర్ సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నారు. భాపతికి చేయాల్సిన అవమానాలన్నీ బీఆర్ఎస్ నేతలు చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అవమానాలు కొనసాగించే పరిస్థితి మానుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. సభాపతి సూచన చేస్తే వాదన పెట్టుకోకుండా సభ సజావుగా నడిచేలా చూడాలన్నారు. వెల్‌లోకి వచ్చి చేయాల్సిన అవమానాలన్నీ చేసి స్పీకర్‌పై సవాల్ విసురుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నం చేయొద్దని కోరారు. విభజన తీసుకురావడానికి మరో ప్రయత్నం మంచిది కాదని, సభాపతితో పాటు వారి తల్లిని దూషిస్తే నిరసనలు తెలిపారని అన్నారు. నిన్న నిరసనలో భాగంగా దళిత సంఘాలు ఎర్రవల్లిలోని రోడ్డుపై నడిస్తే అక్కడ పసుపు నీళ్లతో శుద్ధి చేశారని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు నీటితో రోడ్డు శుద్ధి చేసి అవమానించడమే కాకుండా న్యాయం కావాలంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. న్యాయం కావాల్సింది బలహీనవర్గాలు, దళిత, గిరిజనులకని పేర్కొన్నారు. బీఆర్?ఎస్ చేతుల్లో అవమానానికి గురవుతున్న పేద ప్రజలకు న్యాయం జరగాలని చెప్పారు. విపక్ష నేతల ఆగడాలు, అవమానాలను ప్రభుత్వం సంయమనంతో భరిస్తోందని చెప్పారు. రాష్ట్రాన్ని విపక్ష నేతలు ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. దొరతనం పోకడలను భరించడానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా లేదని ఘాటుగా స్పందించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
గురువారం 10 సెప్టెంబర్ 2026

# అధికారం శాశ్వతం కాదు.. ప్రజలే శాశ్వతం.!

## ప్రజల ప్రేమ, నమ్మకం, ఆశీర్వాదం మాత్రమే శాశ్వతం.. -సామాజిక విశ్లేషకులు కోహిర్ శ్రీనివాస్..






**ఎల్బీనగర్, సెప్టెంబర్ 9, (ప్రజావినికిడి):** పదవి వస్తుంది పోతుంది. కుర్చీ మారుతుంది కానీ ప్రజల నమ్మకం మాత్రం చరిత్రలో నిలిచిపోతుంది. రాజకీయాల్లో అధికారం అనేది శాశ్వతమైన ఆస్తి కాదు. అది ప్రజలు ఇచ్చే బాధ్యత.ఈ రోజు ఒకరి చేతిలో ఉన్న అధికారం రేపు మరొకరి చేతికి వెళ్లవచ్చు.కానీ ప్రజలు మాత్రం అక్కడే ఉంటారు. అందుకే ప్రజల మనసుల్లో స్థానం సంపాదించిన నాయకుడే నిజమైన ప్రజానాయకుడు.పదవి వచ్చిన వెంటనే ప్రజలకు దూరమై, అధికారం ఉందనే అహంకారంతో వ్యవహరించే నాయకులు చాలామంది కనిపిస్తారు.కుర్చీ చుట్టూ అనుచరులు చేరడం, ప్రశంసలు వినడం,తమ మాటే చెల్లాలని భావించడం కొంతకాలం వరకు మాత్రమే సాధ్యం. కాలం మారినప్పుడు అదే కుర్చీ ఖాళీ కావచ్చు.నిన్న వెంట నడిచినవారు కూడా నేడు దూరమవచ్చు.అయితే ప్రజల కష్టాల్లో నిలబడి, వారి సమస్యలను తన సమస్యలుగా భావించి,ఇచ్చిన మాటను నిలబెట్టుకునే నాయకుడిని ప్రజలు ఎప్పటికీ మరిచిపోరు. అధికారం ఉన్నప్పుడు చేసిన సేవ కంటే, అధికారం లేనప్పుడు కూడా ప్రజల మధ్య నిలబడే వ్యక్తిత్వమే నాయకుడి అసలైన విలువను నిర్ణయిస్తుంది.ప్రజలు ఓటు వేసేది కేవలం ఒక వ్యక్తికి కాదు తమ భవిష్యత్తుకు.అందుకే ప్రజల తీర్పును గౌరవించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత.ప్రజల సమస్యలు పక్కనపెట్టి పదవుల కోసం పోరాడటం, కుర్చీల కోసం కలహించుకోవడం, వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం.

రోడ్లు,తాగునీరు, విద్య,వైద్యం, ఉపాధి, రైతు సమస్యలు, పేదల సంక్షేమం వంటి అసలు ప్రజా సమస్యలకు పరిష్కారం చూపడమే రాజకీయాల ప్రధాన లక్ష్యం కావాలి.కుర్చీ కోసం కాదు ప్రజల కోసం పోరాడినప్పుడే అధికారం సార్థకమవుతుంది.చరిత్రలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి వెళ్లాయి..ఎన్నో నాయకులు అధికారాన్ని అనుభవించారు. కానీ ప్రజల కోసం నిజాయితీగా పనిచేసిన వారి పేర్లు మాత్రం తరతరాలకు గుర్తుండిపోయాయి.అదే ప్రజాసేవకు ఉన్న అసలైన శక్తి.అధికారం ఉన్నప్పుడు ప్రజలను కలవడం సులభమే.కానీ అధికారం లేనప్పుడు కూడా ప్రజల మధ్య నిలబడి వారి కన్నీళ్లు తుడిచే వ్యక్తే నిజమైన నాయకుడు..అందుకే అధికారం వచ్చినప్పుడు అహంకారం వద్దు అధికారం పోయినప్పుడు నిరాశ వద్దు.ప్రజలు ఇచ్చిన పదవిని ప్రజల కోసమే ఉపయోగించాలి. ఎందుకంటే కుర్చీ శాశ్వతం కాదు పదవి శాశ్వతం కాదుఅధికారం శాశ్వతం కాదు.ప్రజల ప్రేమ, ప్రజల నమ్మకం, ప్రజల ఆశీర్వాదం మాత్రమే శాశ్వతం.

"కుర్చీ మీద కూర్చున్నంత కాలం నాయకుడు కాదు..కుర్చీ లేకపోయినా ప్రజల మధ్య నిలబడగలిగినప్పుడే నిజమైన ప్రజానాయకుడు.

# ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ పొందిన కొమ్ము శేఖర్ మాదిగ




**హైదరాబాద్,(ప్రజావినికిడి):** సామాజిక ఉద్యమంతో పాటు ఉన్నత విద్యలోనూ రాణించిన కొమ్ము శేఖర్ మాదిగకు ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్ ప్రదానం చేసింది.ఈ నెల 8న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 85వ స్నాతకోత్సవంలో యూనివర్సిటీ ఛాన్సలర్,రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అధ్యక్షతన, ముఖ్య అతిథిగా భారత్ బయోటెక్ ఫౌండర్,చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ కృష్ణ ఎల్లా హాజరయ్యారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం సమక్షంలో శేఖర్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ప్రొఫెసర్ వై. పార్థసారథి పర్యవేక్షణలో "కెపాసిటీ బిల్డింగ్ ఆఫ్ మునిసిపల్ కార్పొరేటర్స్ అండ్ కౌన్సిలర్స్ టువర్డ్స్ అర్బన్ గుడ్ గవర్నెన్స్,ఎస్టడీ ఆఫ్ తెలంగాణ స్టేట్" అనే అంశంపై శేఖర్ పరిశోధన చేశారు.పట్టణ సుపరిపాలన దిశగా మున్సిపల్ కార్పొరేటర్లు, కౌన్సిలర్ల సామర్థ్య నిర్మాణంపై ఆయన చేసిన విశ్లేషణాత్మక పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

సామాజిక న్యాయం కోసం మూడు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్న మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్)లో శేఖర్ నాయకుడిగా ఎదిగారు. ఓయూ అధ్యక్షుడిగా, పలు జిల్లాల ఇన్‌చార్జిగా సేవలందించిన ఆయన ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం యర్కారం గ్రామానికి చెందిన కొమ్ము శేఖర్ మాదిగ,కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించిన కొమ్ము సరోజ-అంజయ్య దంపతుల కుమారుడు. చిన్నతనం నుంచే విద్యపై ఆసక్తి పెంచుకున్న ఆయన స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి వరకు చదివారు. అనంతరం ఎల్‌బీనగర్‌లో పదో తరగతి, ఇబ్రహీంపట్నంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తిచేశారు.

నిజాం కాలేజీలో డిగ్రీ చదువుతున్న సమయంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా చురుకైన పాత్ర పోషించారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పూర్తి చేసి, సామాజిక న్యాయ ఉద్యమంలో కొనసాగుతూనే పీహెచ్‌డీ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేశారు.

డాక్టరేట్ పట్టా అందుకున్న సందర్భంగా తనకు స్ఫూర్తినిచ్చిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగతో పాటు తన పరిశోధనకు మార్గనిర్దేశం చేసిన ప్రొఫెసర్ వై.పార్థసారథి, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధ్యాపకులు, సిబ్బందికి శేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.విద్యను ఆయుధంగా చేసుకుని సామాజిక న్యాయ ఉద్యమంలో కొనసాగుతూ ఉన్నత విద్యలో డాక్టరేట్ సాధించిన కొమ్ము శేఖర్ మాదిగను ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

# సర్పంచుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

## సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్. శివ శంకర్ రెడ్డి. - రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పణ






**షాద్ నగర్,(ప్రజావినికిడి):**రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీల్లో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎల్. శివశంకర్ రెడ్డి నాయకత్వంలో 17 మండలాలకు సంబంధించిన సర్పంచులు అందరూ కలిసి ఈ వినతిపత్రాన్ని అందజేశారు. ఫరూక్ నగర్ మండల అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్, రవీందర్ రెడ్డిలతో పాటు అనేక గ్రామాల సర్పంచులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎల్.శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల స్వయం ప్రతిపత్తిని కాపాడేందుకు అదేవిదంగా స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం ప్రధాన డిమాండ్లు**

పంచాయతీ రాజ్ చట్టం 2018 సవరణ: ఉమ్మడి రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం 2004కు విరుద్ధంగా,పంచాయతీరాజ్ సంస్థల మనుగడను ప్రశ్నార్థకం చేస్తూ అధికారుల పెత్తనానికి ప్రాధాన్యతనిస్తున్న "తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం -2018" ను రద్దు చేయాలి లేదా సవరించాలి.73వ రాజ్యాంగ సవరణ చట్టంలోని 243 + 11వ షెడ్యూల్‌లో ఉన్న 29 అధికారములు,

విధులు,నిధులను యథాతథంగా పంచాయతీలకు కేటాయించాలి.

ఉప సర్పంచ్ చెక్ పవర్ రద్దు గ్రామాలు,రాజకీయ వివాదాలతో అభివృద్ధికి ఆటంకం కలుగుతున్నందున ఉప సర్పంచుల చెక్ పవర్‌ను రద్దు చేయాలి.ఉమ్మడి రాష్ట్రంలో అమలు చేసిన విధంగానే పంచాయతీ విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే నేరుగా చెల్లించాలి.గ్రామ పంచాయతీ స్థానిక పన్నులను, స్టాంప్ డ్యూటీలను,సీనరేజ్,మైనింగ్ మరియు పన్నులను నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేయాలి.

రెవెన్యూ సరిహద్దుల నిర్ణయం: నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీల పరిధిని రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా నిర్ణయించాలి.తండా గ్రామ పంచాయతీలకు

(జిపి) భవనములు మరియు రోడ్లను మంజూరుచేయాలి.ముఖ్యమంత్రి హామీ నిధుల విడుదల: గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విధంగా మైనర్ గ్రామ పంచాయతీలకు 5 లక్షలు, మేజర్ గ్రామ పంచాయతీలకు 10 లక్షలు వెంటనే విడుదల చేయాలి.జనరల్ ఫండ్ బకాయిలు:గత 2 సంవత్సరాల నుండి నిలిచిపోయిన జనరల్ ఫండ్ బకాయిలు దాదాపు ₹500 కోట్లను వెంటనే విడుదల చేయాలి.15వ ఆర్థిక సంఘం కింద కేంద్రం నుండి తెలంగాణకు రావలసిన 1090 కోట్ల బకాయిలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలి.మ్యాచింగ్ గ్రాంట్లు: తెలంగాణ ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్లు ₹2,979 కోట్ల పెండింగ్ బకాయిలను విడుదల చేయాలి.

ఎమ్మెల్సీ ఎన్నికలలో సర్పంచులకు ఓటు హక్కు కల్పించాలి.గౌరవ వేతనం పెంపు,ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ సర్పంచుల కోసం సర్పంచుల గౌరవ వేతనాన్ని 6,500/-ల నుండి 25,000/- లకు పెంచాలి.

ఇందిరమ్మ కమిటీల జీవో రద్దు: "ఇందిరమ్మ కమిటీల" పేరుతో గ్రామ సభ సర్పంచుల అధికారాలను నీరుగారుస్తున్న జీవోను వెంటనే రద్దుచేయాలి.ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులు ఉపాధి హామీ కింద కేంద్ర ప్రభుత్వం కేటాయించే బడ్జెట్‌ను నేరుగా గ్రామ పంచాయతీ అకౌంట్‌లో జమచేయాలి.

# వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు కల్పించాలి

## ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్



**ముషిరాబాద్, (ప్రజావినికిడి):** జీఓ నెం.81,85 ప్రకారం 61 ఏళ్లు పైబడిన వీఆర్ఏల స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు ఇచ్చి దళిత, బలహీనవర్గాల కుటుంబాలను ఆదుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు,ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ మేరకు బుధవారం వీఆర్ఏలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ వీఆర్ఏ జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో వీఆర్ఏ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు డాక్టర్ ప్రొఫెసర్ దాసోజు శ్రవణ్ కుమార్, నెల్లికంటి సత్యం, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు ముఠా జైసింహ లు హాజరై సంఘీబావం తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ, జీఓల ప్రకారం రాష్ట్రంలోని 20,555 మంది వీఆర్ఏల్లో 16,768 మందిని వివిధ శాఖల్లో సర్దుబాటు చేయగా,3,797 మంది వీఆర్ఏల వారసులకు ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉందన్నారు. మూడు సంవత్సరాలుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలు ఆర్థిక,మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయనిపేర్కొన్నారుఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించి ఢిల్లీకి డబ్బు సంచులు మోస్తున్నది ఆరోపించారు. లక్షల కోట్ల ధనాన్ని దోచుకుంటుందని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి మంత్రి పొంగిలేటి లు శాడిస్టుల మారారని అన్నారు.లక్షల కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నది కానీ వీఆర్ఏలను క్రమబద్ధీకరించడానికి ఏమవుతుందని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, గ్రామాన్ని కాపాడే వీఆర్ఏలను పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 20వేల మందిని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పర్మినెంట్ చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన 81,85 జీవో ప్రకారం ఇవ్వాలని, కేసీఆర్ ఇచ్చిన జీవో చెల్లదని మంత్రి పొంగులేటి చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీసీ యవజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లపల్లి అంజి, వీఆర్ఏ జేఏసీ గౌరవాధ్యక్షులు వంగూరు రాములు,రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్, ఉపాధ్యక్షులు భరత్,హరీష్, మన్నె సాగర్, శ్రీకాంత్,రవి సాగర్, సంగమహేశ్వర్, వెంకటేష్, ఇమాంపాషా, కుమార్,రాజన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి సంఘం నూతన కమిటీ ఎన్నిక



**అంబర్ పేట్, (ప్రజావినికిడి):**

పద్మశాలి సంఘం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. సంఘం కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో మూడు సంవత్సరాల కోసం ఈ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కత్తుల సుదర్శన్ రావు,గౌరవ అధ్యక్షుడు ఎనుగంటి నరేందర్, సలహాదారులు డాక్టర్ మార్త రమేష్,డాక్టర్ పుట్ట పాండురంగయ్య, చిలువేరు యాదగిరి ల నేతృత్వంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా వర్కాల కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ గా పగిడిమర్రి హరి, ప్రధాన కార్యదర్శిగా చిలక శివ్ కుమార్, కోశాధికారిగా భీమనపల్లి అశోక్, ఉపాధ్యక్షులుగా ఎలగందుల అంజయ్య,పెద్ద బొమ్మ మధుసూదన్, అంజాల విజయ్ కుమార్,ఏవి రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గంజి వెంకటరమణ, గంధమల్ల శ్రీనివాస్,ఆవుల రాములు, జాయింట్ సెక్రెటరీలుగా గంగిశెట్టి మల్లేష్, తీగల నరేందర్, రాజేందర్ నాగుల,ప్రచార కార్యదర్శిగా వనం రమణ, కార్యవర్గ సభ్యులుగా ఇడెం యాదగిరి, సిలివేరు జయసింహలను ఎన్నుకున్నారు. అలాగే నియోజకవర్గ మహిళా సంఘం అధ్యక్షురాలిగా భోగా నీరజను కూడా ఏకగ్రీవంగా నియమించారు. వీరితోపాటు గోల్నాక డివిజన్ అధ్యక్షుడిగా పెద్ద బొమ్మ దామోదర్, కాచిగూడ డివిజన్ అధ్యక్షుడిగా కోట వెంకటేష్, తిలక్ నగర్ అధ్యక్షునిగా సాయిని మూర్తి, పటేల్ నగర్ డివిజన్ అధ్యక్షునిగా గంగిశెట్టి సత్తయ్య,ప్రధాన కార్యదర్శిగా బండారు రాజు, బాగ్ అంబర్ పేట డివిజన్ అధ్యక్షునిగా మామిడాల రాజ్ కిరణ్,బర్కత్ పుర డివిజన్ అధ్యక్షుడిగా కైరం కొండ శ్రీకాంత్ లను అధ్యక్షుడు వర్గాల కృష్ణ నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, సంఘం పటిష్టత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. త్వరలోనే సంఘం సభ్యత్వాన్ని కూడా చేపడతామని విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

# మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



**కొత్తపేట, (ప్రజావినికిడి):** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయక విగ్రహాలకు బదులుగా పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలనే సందేశంతో ఈ రోజు ఎల్‌బీ నగర్‌లోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.లైఫ్ సేవర్స్ సంస్థ ఆధ్వర్యంలో, పాఠశాల యాజమాన్యం సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ,నీటి కాలుష్యం నివారణపై అవగాహన కల్పించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల నీటి వనరులు కాలుష్యానికి గురవుతున్నాయని వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థుల సమక్షంలో ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. రెండు వేర్వేరు నీటి పాత్రల్లో మట్టి వినాయక విగ్రహం మరియు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాన్ని ఉంచి వాటి మధ్య తేడాను చూపించారు. మట్టి విగ్రహం నీటిలో సులభంగా కరిగిపోతుందని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహం కరగకుండా ఉండటం వల్ల నీటి కాలుష్యం ఏర్పడుతుందని విద్యార్థులకు వివరించారు.అనంతరం లైఫ్ సేవర్స్ ఫౌండర్ శివ నేత మరియు లైఫ్ సేవర్స్ బృందం పర్యావరణ పరిరక్షణ, మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై రూపొందించిన పోస్టర్లను పాఠశాల విద్యార్థుల సమక్షంలో ఆవిష్కరించి, కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఇకపై పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో శివ నేత,శంకరా చారి,శ్రీలత,సుధీర్, వెంకటేష్,గణేష్, రవి తేజ, హరీష్,అశోక్,స్పర్శ,సూర్య, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## గోల్నాక డివిజన్ అధ్యక్షుడిగా పెద్ద బొమ్మ దామోదర్



**అంబర్ పేట్, (ప్రజావినికిడి):** అంబర్ పేట్ పద్మశాలి సంఘం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. సంఘం కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో మూడు సంవత్సరాల కోసం ఈ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కత్తుల సుదర్శన్ రావు,గౌరవ అధ్యక్షుడు ఎనుగంటి నరేందర్, సలహాదారులు డాక్టర్ మార్త రమేష్,డాక్టర్ పుట్ట పాండురంగయ్య, చిలువేరు యాదగిరిల నేతృత్వంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా వర్కాల కృష్ణ గోల్నాక డివిజన్ అధ్యక్షుడిగా పెద్ద బొమ్మ దామోదర్ ను రెండో సారిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పెద్దబొమ్మ దామోదర్ మాట్లాడుతూ, గోల్నాక డివిజన్ అధ్యక్షుడుగా నన్ను రెండోసారి ఎన్నుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తూచ తప్పకుండా సంఘం అభివృద్ధికి కార్యక్రమానికి ఎల్లవేళల కృషి చేస్తానని హామీనిచ్చారు.

## ఘనంగా కాళోజి నారాయణరావు జయంతి




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ తెలంగాణ ప్రముఖ కవి, ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా బుధవారం ఘనంగా నిర్వహించారుషాద్‌నగర్‌లోని తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పినపాక ప్రభాకర్ మాట్లాడుతూ,తెలంగాణ భాష, యాస, సంస్కృతి,ప్రజల జీవన విధానాన్ని తన రచనలు, కవితల ద్వారా ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి కాళోజి నారాయణరావు అని కొనియాడారు.తెలంగాణ మాండలికానికి, ప్రజల భాషకు ప్రత్యేకగుర్తింపుతీసుకురావడంలో ఆయనచేసినకృషిచిరస్మరణీయమన్నారు.కాళోజి నారాయణరావు కర్ణాటకలో జన్మించినప్పటికీ తెలంగాణపై అపారమైన మక్కువతో ఈ ప్రాంత ప్రజల సమస్యలపై స్పందిస్తూ,తెలంగాణ కోసం జరిగిన ఉద్యమాల్లో తనదైన పాత్ర పోషించారని తెలిపారు. ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమన్నారు.అనంతరం వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ, కాళోజి నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ కవి జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కాళోజి కవితలు ప్రజల్లో చైతన్యం నింపాయని, ఉద్యమానికి ఆయన సాహిత్యం ఎంతో ఉపయోగపడిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణఉద్యమకారులు,మేకల వెంకటేష్,రవి గౌడ్,సునీల్ రెడ్డి, సిందం విటలయ్య,అద్దెట్ల రాజు,అల్లాడ శేఖర్,కుడుముల మల్లేష్,పినపాక ప్రబాకర్,సునీల్ రెడ్డి,సుదాకర్, అసోసియేషన్ సభ్యులు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావును కలిసిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి.

### 17 సెప్టెంబర్ తెలంగాణ విమోచన దినోత్సవంపై చర్చ



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**మాజీ గవర్నర్ సిహెచ్. విద్యాసాగర్ రావుని తెలంగాణ విమోచన కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి,బంగారు శ్రుతి,రవీందర్ రావు వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ విమోచనం,సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవం,విమోచన పోరాటంలో సామాన్య ప్రజల పాత్ర తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.హైదరాబాద్ సంస్థాన విమోచనంకోసంజాతీయవాదులు చేసిన పోరాటం,వారి త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, తెలంగాణ విమోచన చరిత్రను భావితరాలకు అందించాల్సిన ఆవశ్యకతపై చర్చ జరిగింది.సెప్టెంబర్ 12న స్టాలిన్ కాలేజీలో నిర్వహించనున్న మేధావుల సమావేశానికి మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావుని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి ఆహ్వానించారు.
తెలంగాణ విమోచన ఉద్యమానికిసిహెచ్.విద్యాసాగర్ రావు 1998లో విమోచన దినోత్సవంగా సెప్టెంబర్‌ను నిర్వహించాలని ఉద్యమాన్ని బీజేపీ ప్రారంభించిందని గుర్తు చేశారు. బీజేపీ సుదీర్ఘ పోరాటం తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చిందని, రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చడం లేదని అన్నారు.

## తాతా మధును సస్పెండ్ చేయాలి :బట్టె రాజ్ కుమార్



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 9,(ప్రజావినికిడి):**
అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను టీపీసీసీ ఎస్సి సెల్ వైస్ చైర్మన్ బట్టె రాజ్ కుమార్ తీవ్రంగా ఖండించారు.స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు పోలీసుల చొక్కాలు పట్టుకుని దాడికి దిగడం సరైన చర్య కాదని ఆయన మండిపడ్డారు.బీఆర్ఎస్ నాయకులకు దళితుల పట్ల చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అక్కసుతో దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అక్రమాలు, స్కామ్‌లను వెలికితీసి ప్రజల ముందుకు తీసుకువస్తామని హెచ్చరించారు.

## షాద్‌నగర్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్

### పెండింగ్ దర్యాప్తులు, కీలక కేసులపై సమీక్ష.. -సకాలంలో దర్యాప్తులు పూర్తి చేయాలని ఆదేశం







**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ డా.తరుణ్ జోషి, ఐపీఎస్ బుధవారం షాద్‌నగర్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసి నేరాలు, దర్యాప్తులు,కోర్టు వ్యవహారాలు, పరిపాలనా రికార్డులను సమగ్రంగా సమీక్షించారు. తనిఖీలో భాగంగా కార్యాలయ రికార్డులతో పాటు గ్రేవ్ (ఖ×) కేసులు,ఎస్సీ/ఎస్టీ కేసులు, పెండింగ్ దర్యాప్తులు, మహిళలు అలాగే పిల్లలపై నేరాలకు సంబంధించిన కేసులు,కోర్టు వ్యవహారాలు, ప్రివెంటివ్ పోలీసింగ్ రికార్డులను కమిషనర్ పరిశీలించారు.
పెండింగ్ దర్యాప్తుల పురోగతి, ముఖ్యమైన కేసుల స్థితిగతులను సమీక్షించిన డా. తరుణ్ జోషి.. కేసుల దర్యాప్తును నాణ్యతతో, సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, కోర్టు కేసులపై సమర్థవంతమైన ఫాలోఅప్ కొనసాగించాలని సూచించారు. మహిళలు, పిల్లలు,ఇతర సున్నితమైన కేసులపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రివెంటివ్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని కమిషనర్ ఆదేశించారు. పెండింగ్ కేసులను క్రమబద్ధంగా పర్యవేక్షిస్తూ అనవసర జాప్యం లేకుండా దర్యాప్తులను తాత్కాలిక ముగింపుకు తీసుకురావాలని సూచించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో షాద్‌నగర్ జోన్ డీసీపీ శ్రీమతి సిరిష,షాద్‌నగర్ ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణతో పాటు ఏసీపీ కార్యాలయ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫేక్ మార్ఫింగ్,ఏఐ జనరేటెడ్ చిత్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలి..

### బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు..



**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు,ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా,వివిధ డిజిటల్ వేదికల్లో మార్ఫింగ్ చేసిన తప్పుడు అలాగే ఏఐ ద్వారా రూపొందించిన చిత్రాలు,దుష్ప్రచార కంటెంట్‌ను విస్తృతంగా ప్రచారం చేస్తున్న వారిపై తక్షణమే దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ శాసనసభాపక్షం ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి,బండారు లక్ష్మారెడ్డి,పల్ల రాజేశ్వర్ రెడ్డి అదేవిదంగా ఎమ్మెల్సీ మధుసూదన్ చారి ఈ మేరకు తెలంగాణ డీజీపీకి మహేష్ మురళీధర్ భగవత్ ఐపీఎస్.డీజీపీ కు బీఆర్ఎస్ శాసనసభాపక్షం తరపున ఫిర్యాదు అందజేశారు.రెండు రోజుల క్రితం తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు,ఇతర ప్రజాప్రతినిధులపై జరిగిన దాడి,దురుసు ప్రవర్తన ఘటనల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు కావాలనే ఫేక్ డిజిటల్ కంటెంట్‌ను సృష్టించి ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఫేక్/ఏఐ జనరేటెడ్ చిత్రాలను నిజమైనవిగా చూపిస్తూ ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి చెందడంతో పాటు ఎన్నికైన ప్రజాప్రతినిధుల ప్రతిష్టకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని బీఆర్ఎస్ శాసనసభా పక్షం పేర్కొంది.సైబర్ క్రైమ్ విభాగం వెంటనే ఫేక్,మార్ఫింగ్,
ఏఐ జనరేటెడ్ చిత్రాలు పోస్టులను గుర్తించి దర్యాప్తు చేయాలి.వాటిని రూపొందించి అప్‌లోడ్ చేసి ప్రచారం చేసిన వ్యక్తులను గుర్తించాలి.చిత్రాలపై సాంకేతిక ఫోరెన్సిక్ దర్యాప్తు నిర్వహించాలి.సైబర్ క్రైమ్, పరువునష్టం,తప్పుడు సమాచార ప్రచారం తదితర వర్తించే చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలి.సంబంధిత డిజిటల్ ఆధారాలు,అకౌంట్ వివరాలు,యుఆర్ఎల్ లు,టైమ్‌స్టాంప్‌లు,మెటాడేటాను భద్రపరచాలి.తప్పుడు మార్ఫింగ్ కంటెంట్ వ్యాప్తిని అడ్డుకుని ప్రజాప్రతినిధుల గౌరవాన్ని కాపాడాలి.రాజకీయ భేదాలు ఉన్నాయనే కారణంతో ఎన్నికైన ప్రజాప్రతినిధులపై కల్పిత డిజిటల్ కంటెంట్‌ను తయారు చేసి ప్రచారం చేయడం సమర్థనీయం కాదని బీఆర్ఎస్ శాసనసభాపక్షం స్పష్టం చేసింది.అలాగే అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలో పోలీసుల వైఖరిపై,అలాగే సంబంధిత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై కూడా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.ఈ మొత్తం వ్యవహారంపై నిష్పక్షపాతంగా,అత్యవసరంగా దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు.

## ఉప సర్పంచ్లకు వినతులకు సానుకూలంగా స్పందించిన పంచాయతీ రాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్

### మెమరండం ఇచ్చిన ఉపసర్పంచ్ల నాయకులు ఎం.గోవర్ధన్ రెడ్డి,ఎం.ప్రకాష్ గౌడ్,జి అభినవ్,ఎస్.జావిద్

### రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్,ప్రధానకార్యదర్శి మట్ట శ్రీనివాస్ అధ్యక్షతన





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం నిర్వహించారు.అనంతరం తెలంగాణ పంచాయతీరాజ్ కమిషనర్ శ్రీమతి దివ్య దైవ రాజన్ ఐఏఎస్ ని,అలాగే పంచాయతీరాజ్ వైస్ చైర్మన్ సుధాకర్ ని కలిసి మెమోరండం సమర్పించిన ఉప సర్పంచ్ ల సంఘం నాయకులు.ఈ సందర్భంగా కమిషనర్ దివ్య దేవ రాజన్ ఉప సర్పంచ్ ల ముఖ్య నాయకులతో దాదాపు గంట పాటు చర్చలు కొనసాగించి,ఉప సర్పంచుల సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించి,ఉప సర్పంచుల చెక్ పవర్ సాధారణ నియమాలతో కొనసాగిస్తామని, శిలాఫలకాలపై ఉప సర్పంచుల పేర్లు ఉండేలా జీవో,మండల సర్వసభ్య సమావేశాలకు ఉప సర్పంచులకు అధికారిక ఆహ్వానం,గ్రామ పంచాయతీ ప్రతి తీర్మానంపై ఉప సర్పంచులు సంతకం చేసే విధంగా జీవో లను,వెంటనే విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలంగాణ పంచాయతీరాజ్ కమిషనర్ శ్రీమతి దివ్య దేవరాజన్ ఐఏఎస్ హామీ ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఉపసర్పంచ్ ల నాయకులు మాట్లాడుతూ, ఈ విజయం కోసం హైదరాబాద్‌కు తరలివచ్చిన వివిధ జిల్లాల ఉప సర్పంచులకు,అలాగే మన హక్కుల కోసం పోరాటంలో అరెస్టయిన ప్రతి ఒక్క ఉప సర్పంచ్‌కు లభిస్తుంది మరియు వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు బోట్ల కార్తిక్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్ట శ్రీనివాస్,షాద్ నగర్ నియోజకవర్గం అధ్యక్షులు మల్కయ్యగారి గోవర్ధన్ రెడ్డి, ఫరుక్ నగర్ మండల అధ్యక్షులు ముక్కుపోగుల ప్రకాష్ గౌడ్,జిల్లా ఉపసర్పంచ్ల ఫోరం జి.అభినవ్,గుడిసె బాలరాజ్, సయ్యద్ జావిద్,ఎన్ బలరాం, రాష్ట్ర,జిల్లాల,మండల ఉప సర్పంచ్ నాయకులు,ఉపసర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వనాధపురంలో మహిళా సమాఖ్య డబ్బులపై గందరగోళం

### రూ.10 లక్షల వరకు గోల్‌మాల్ జరిగిందంటూ ఆరోపణలు.. నిధులకు సమాధానం చెప్పాలన్న సర్పంచ్ శ్రీలత

### గ్రామ మహిళలకు న్యాయం చేయాలి.. అధికారులు తక్షణమే స్పందించాలి..





**కొందుర్గు,(ప్రజావినికిడి):** మండలంలోని విశ్వనాధపురం గ్రామంలో మహిళా సమాఖ్య నిధులకు సంబంధించి గందరగోళం నెలకొంది. సుమారు రూ.10 లక్షల వరకు నిధులు గోల్‌మాల్ అయ్యాయని మహిళలు ఆరోపిస్తూ,గత రెండు రోజులుగా గ్రామ కూడలిలో తమకు న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళా సమాఖ్యకు సంబంధించిన నిధుల లావాదేవీలపై సంబంధిత(వివో ఏ)పూర్తి వివరాలు వెల్లడించి, నిధులకు లెక్కలు చెప్పాలని గ్రామ సర్పంచ్ శ్రీలత డిమాండ్ చేశారు.మహిళల డబ్బులకు సంబంధించి అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని ఆమె కోరారు.గ్రామ మహిళలకు న్యాయం జరగాలి..మహిళా సమాఖ్య నిధులు ఎక్కడికి వెళ్లాయో స్పష్టత రావాలి అని సర్పంచ్ శ్రీలత అన్నారు.నిధుల విషయంలో అవకతవకలు జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని,మహిళలకు నష్టం జరిగినట్లయితే వారి డబ్బులు తిరిగి ఇప్పించాలని ఆమె డిమాండ్ చేశారు.గత రెండు రోజులుగా మహిళలు గ్రామ కూడలిలో తమ సమస్య పరిష్కారంకోసం ఎదురుచూస్తున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడం బాధాకరమని సర్పంచ్ శ్రీలత పేర్కొన్నారు.
మహిళల ఆవేదనను అధికారులు ఇకనైనా పట్టించుకుని తక్షణమే విచారణ చేపట్టి నిజానిజాలను బయటపెట్టాలని ఆమె కోరారు. మహిళల కష్టార్జిత డబ్బులకు లెక్కలు చెప్పాలి. నిధుల విషయంలో ఎవరి బాధ్యత ఉందో తేల్చాలి. గ్రామ మహిళలకు న్యాయం జరిగేలా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి అని సర్పంచ్ శ్రీలత డిమాండ్ చేశారు.

# తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరు కానున్న ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి

## ప్రత్యేక ఆహ్వానం పలికిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 09: (ప్రజావినికిడి):**
తెలంగాణను ప్రపంచ పెట్టుబడులు, వ్యవసాయ వాణిజ్యం, పారిశ్రామిక అవకాశాలకు ప్రధాన గమ్యస్థానంగా నిలిపే లక్ష్యంతో 2026 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక లి"తెలంగాణ రైజింగ్ సమ్మిట్"లికు హాజరుకావాల్సిందిగా ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్‌ను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానించారు. న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ఉదయం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత, ఉత్పాదక సామర్థ్యం, ఎగుమతి అవకాశాలను ఆయనకు వివరించడంతోపాటు



తెలంగాణ రైజింగ్ సమ్మిట్ లక్ష్యాలు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులను భారీగా పెంచడం, ఇరు ప్రాంతాల మధ్య వ్యవసాయ వాణిజ్య సంబంధాలను మరింత విస్తరించడం, దీర్ఘకాలిక వాణిజ్య భాగస్వామ్యాన్ని నెలకొల్పడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ నుంచి పెద్ద పరిమాణంలో బియ్యాన్ని కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న నాణ్యమైన మాంస ఉత్పత్తులు, అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విత్తనాల కొనుగోలుపైనా శ్రీ ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్ ఆసక్తి వ్యక్తం చేశారని తెలిపారు. ప్రపంచస్థాయి ప్రమాణాలు, విస్తారమైన ఉత్పత్తి సామర్థ్యం, నాణ్యతతో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించగలవని ఆయన పేర్కొన్నారు. "తెలంగాణ రైతు పండించిన ధాన్యానికి అంతర్జాతీయ మార్కెట్ ద్వారాలు తెరవడమే మా ప్రభుత్వ లక్ష్యం. బియ్యం ఎగుమతులు విస్తరించడం ద్వారా రైతులకు మెరుగైన ధరలు లభించడంతోపాటు రైస్‌మిల్లర్లు, విత్తన కంపెనీలు, మాంస ఉత్పత్తిదారులు, ఆహారశుద్ధి పరిశ్రమలకు అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. వ్యవసాయాన్ని కేవలం జీవనాధారంగా కాకుండా ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానమైన లాభసాటి ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోంది" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ సమ్మిట్ రాష్ట్ర అభివృద్ధి ఆకాంక్షలకు అంతర్జాతీయ వేదికగా నిలుస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయం, ఆహారశుద్ధి, విత్తనోత్పత్తి, ఎగుమతులు, సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడుల రంగాల్లో తెలంగాణ--ఫిలిప్పీన్స్ మధ్య నూతన భాగస్వామ్యానికి ఈ సమ్మిట్ బలమైన పునాది వేస్తుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# తాతా మధు వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ ర్యాలీ







**ఎల్బీనగర్, సెప్టెంబర్ 9, (ప్రజావినికిడి):**
అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కుంట్లూర్ డివిజన్‌లో చావు డప్పుతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం దిష్టిబొమ్మ దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో నిరసనకారులను పోలీసులు అరెస్ట్ చేసి హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు గ్యారాల శ్రీనివాస్ మాట్లాడుతూ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు పోలీసుల చొక్కాలు పట్టుకుని దాడికి దిగడం సరైన చర్య కాదని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులకు దళితుల పట్ల చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అక్కసుతో దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అక్రమాలు, స్కామ్‌లను వెలికితీసి ప్రజల ముందుకు తీసుకువస్తామని గ్యారాల శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జైపాల్ రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ భాస్కర్ చారి, టీపీసీసీ ఎస్సి సెల్ వైస్ చైర్మన్ బట్టె రాజ్ కుమార్, మాజీ ఎంపిటిసి భాస్కర్ గౌడ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఆయుష్ విద్యార్థులకు స్టైఫండ్ డబుల్..

**భారీగా పెంచుతూ జీవో జారీ**

**సెక్రటేరియట్‌లో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన స్టూడెంట్స్.**

**జీవో కాపి అందజేసిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**హైదరాబాద్,సెప్టెంబరు 09 (ప్రజావినికిడి):**
ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, నేచరోపతి విభాగాల్లోని హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైఫండ్లను భారీగా పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇప్పటివరకు హౌస్ సర్జన్లకు నెలకు రూ.13,754గా ఉన్న స్టైఫండ్‌ను రూ.29,792కు పెంచారు. పీజీ విద్యార్థుల స్టైఫండ్ 34,385 నుంచి 74,482కు పెరిగింది. స్టైఫండ్ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయుష్ విద్యార్థులు, డాక్టర్లు బుధవారం మధ్యాహ్నం, సచివాలయంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులకు పెంచిన స్టైఫండ్‌కు సంబంధించిన జీఓ కాపీని అందజేశారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్కసారి కూడా తమ స్టైఫండ్ పెంచలేదని, దీంతో ఆయుష్ విద్యార్థులు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటిది ఇప్పుడు అల్లోపతి మెడికోలతో సమానంగా తమ స్టైఫండ్‌ను పెంచడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. తమ సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఆయుష్ విద్యార్థులు, డాక్టర్ల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన మంత్రి



దామోదర్ రాజనర్సింహ వారికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్‌లో మంచి వైద్యులుగా ఎదిగి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. యువతే దేశ భవిష్యత్తు.. విద్యార్థులే భావి పౌరులు అని మంత్రి అన్నారు. విద్య అనేది కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాదని, వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజంలో గుణాత్మక మార్పుకు విద్య పునాది అని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో రాష్ట్రంలో ఆయుష్ వైద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక కీలక చర్యలు చేపట్టిందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 700 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించి, ప్రజలకు యోగా, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఆయుర్వేదం, హోమియోపతి, యునాని విభాగాల్లో 138 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించి, ఆయుష్ వైద్య విద్య, బోధన వ్యవస్థను మరింత బలోపేతం చేశామని పేర్కొన్నారు. సిద్దిపేట్, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్ జిల్లాల్లో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రులను ఏర్పాటు చేసి, ఆయుష్ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేశామని తెలిపారు. కరీంనగర్‌లో రూ.15 కోట్ల వ్యయంతో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టామని మంత్రి తెలిపారు. ఈ హాస్పిటల్ ద్వారా ఆయుష్ వైద్య సేవలను మరింత విస్తరించే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలోని ఆయుష్ ఆసుపత్రులు, క్లినిక్‌లను దశలవారీగా అప్‌గ్రేడ్ చేస్తూ, మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఆయుష్ వైద్య విధానాలకు ప్రజల్లో మరింత ఆదరణ పెరిగేలా విద్యార్థులు, యువ వైద్యులు కృషి చేయాలని మంత్రి సూచించారు. ఆయుష్ వైద్య విధానాలపై శాస్త్రీయ పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని, కొత్త చికిత్సా విధానాలు, ఔషధాలపై పరిశోధన చేసి ఆయుష్ వైద్య విధానాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. "మీరు చదువుతో ఆగిపోవద్దు.. పరిశోధన వైపు కూడా అడుగులు వేయాలి. మన సంప్రదాయ వైద్య విజ్ఞానాన్ని ఆధునిక పరిశోధనతో అనుసంధానం చేసి ప్రపంచానికి పరిచయం చేయాల్సిన బాధ్యత యువ వైద్యులపై ఉంది" అని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. పేదలు, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఆయుష్ వైద్యులు కీలక పాత్ర పోషించాలని మంత్రి సూచించారు. విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడంతో పాటు వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.

# జగన్ పాదయాత్ర 2.0కు ముహూర్తం ఖరారు

**మరోసారి సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధమైన వైఎస్ జగన్**

**2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో యాత్ర ప్రారంభం**

**అమరావతి సెప్టెంబరు 09 (ప్రజావినికిడి):**
వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. 2029 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లేందుకు ఆయన ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా తాను చేపట్టబోయే రెండో విడత పాదయాత్రకు ముహూర్తం ఖరారు చేశారు. 2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని స్పష్టత ఇచ్చారు. బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ వైసీపీ కార్యకర్తల సమావేశంలో జగన్ ఈ కీలక ప్రకటన చేశారు. గతంలో అధికారం కోసం జగన్ ఇదే ఫార్ములాను అనుసరించిన విషయం తెలిసిందే. 2017 నవంబర్ 6న కడప జిల్లా ఇడుపులపాయలో 'ప్రజా సంకల్ప యాత్ర' పేరుతో ఆయన తన తొలి పాదయాత్రను ప్రారంభించారు.



ఆ యాత్ర 341 రోజుల పాటు ఏకధాటిగా సాగి, 3,648 కిలోమీటర్ల దూరం కొనసాగింది. 2019 జనవరి 9న శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురంలో యాత్ర ముగిసింది.

ఈ యాత్రలో భాగంగానే ఆయన 'నవరత్నాలు' పథకాలను ప్రకటించారు. ప్రజల నుంచి వచ్చిన అపూర్వ స్పందన, యాత్రలో తెలుసుకున్న సమస్యల ఆధారంగా రూపొందించిన ఈ హామీలు 2019 ఎన్నికల్లో వైసీపీకి చారిత్రాత్మక విజయాన్ని అందించాయి. మళ్లీ అదే సెంటిమెంట్‌తో 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా జగన్ ఈ రెండో పాదయాత్రకు సిద్ధమయ్యారు. 2027లో యాత్ర ప్రారంభించి, ఎన్నికల వరకు దాదాపు రెండేళ్ల పాటు ప్రజల మధ్యే ఉండాలని ఆయన భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ యాత్ర ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు ప్రస్తుత కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని జగన్ వ్యూహరచన చేస్తున్నారు. త్వరలోనే ఈ పాదయాత్రకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, రూట్‌మ్యాప్‌పై స్పష్టత రానుంది. మొత్తం మీద 2029 ఎన్నికల సమరానికి జగన్ ఇప్పటినుంచే 'పాదయాత్ర 2.ఓ'తో సిద్ధమవుతున్న సంకేతాలు పంపారు.

# ప్రతి వారం ప్రజల మధ్యనే

## కోనసీమ జిల్లా 'మీ భూమి - మీ హక్కు' గ్రామసభ లో సీఎం చంద్రబాబు



**సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు**

**గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దుతూ రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన**

**16 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించినట్టు వెల్లడి**

**భూమికి పూర్తి భద్రత కల్పించేలా రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాలు**

**రూ.240 కోట్లతో ఈపీడీసీఎల్ గ్రిడ్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన**



**పి.గన్నవరం సెప్టెంబరు 09, (ప్రజావినికిడి):**
సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు మూల మంత్రాలతోనే కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సచివాలయానికి పరిమితమై పనిచేయడం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య ఉంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపడమే అసలైన సుపరిపాలన అని, దానికోసం తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఉద్ఘాటించారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గంలోని మాచడవ పండువారిపేటలో బుధవారం నిర్వహించిన 'మీ భూమి – మీ హక్కు' గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి వారం ప్రజల వద్దకే వస్తున్నానని, వారి బాగోగులు తెలుసుకుంటూ పాలన సాగిస్తున్నానని తెలిపారు.

ప్రతినెలా ఒకటో తేదీన పేదల వద్దకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందిస్తూ వారి కష్టసుఖాలను తెలుసుకుంటున్నానని సీఎం గుర్తుచేశారు. అలాగే, ప్రతి నెలా మూడో శనివారం 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో, నాలుగో శనివారం పీ4 (ప్రజలు, ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యం) కార్యక్రమంలో పాల్గొంటూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరిగితేనే సంపద సృష్టి జరుగుతుందని, తద్వారా ప్రజలంతా గౌరవంగా జీవించేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

**భూమికి భద్రత.. గత ప్రభుత్వ పాపాల ప్రక్షాళన**
ప్రతి నెలా 9వ తేదీన 'మీ భూమి – మీ హక్కు' కార్యక్రమం ద్వారా రైతులకు, యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని సీఎం తెలిపారు.

# నేడు 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు




**అమరావతి సెప్టెంబరు 09, (ప్రజావినికిడి):** 10, 11వ తేదీల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు జరగనుంది. రాష్ట్ర సచివాలయంలో రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్లతో పాటు మంత్రులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, విభాగాధిపతులు పాల్గొననున్నారు. 7వ కలెక్టర్ల సదస్సులో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యల నివేదికతోనే మొదటి రోజు సమావేశాలు ప్రారంభమవుతాయి. ఆర్థిక వృద్ధి, సంక్షేమం, మానవాభివృద్ధి, సాంకేతికత, పెట్టుబడులు, శాంతిభద్రతలు లాంటి కీలక విభాగాల వారీగా సమీక్షించనున్నారు. అలాగే ప్రభుత్వ సేవలు, వివిధ పథకాల అమలు వంటి వాటిపై క్షేత్రస్థాయి పరిస్థితులపై ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశా నిర్దేశం చేయనున్నారు. రెండు రోజులు... 19 అంశాలుమొదటి రోజున జీఎస్డీపీ, స్వర్ణాంధ్ర విజన్‌కు జిల్లాస్థాయి రోడ్‌మ్యాప్‌లపై సమీక్షిస్తారు. అదే విధంగా సూపర్ సిక్స్ పథకాలు, తాగునీరు, గృహనిర్మాణం, ఆరోగ్యం, విద్యా రంగంలో పురోగతి, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, జలధార, జిల్లాల బెస్ట్ ప్రాక్టీసెస్ సదస్సులో పలువురు కలెక్టర్లు ప్రదర్శిస్తారు. ఇక రెండో రోజు సదస్సులో ఇ-గవర్నెన్స్, ఫైళ్ల పరిష్కారం, ఆర్టీజీఎస్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, జిల్లాల వారీ ర్యాంకింగ్స్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం, నైపుణ్యాభివృద్ధి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం, శాంతిభద్రతలపై సమీక్షించి... అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్ధేశం చేయనున్నారు.



# యుద్ధ విరమణ దిశగా సాగని చర్చలు!!

రష్యా- ఉక్రెయిన్ మధ్య చాలా కాలంగా యుద్ధం కొనసాగుతూనే ఉంది. యుద్ధ విరమణకు అనేక దఫాలుగా చర్చలు జరిగిన ఎ ఒక్కటీ కొలిక్కిరాలేదు. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరియు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గంట పాటు ఫోన్ ద్వారా సంభాషించారు. ఈ సంభాషణలో శాంతి చర్చకర్తలైన స్టీవ్ విట్కాఫ్ మరియు జారెడ్ కుష్నర్ రష్యా మరియు ఉక్రెయిన్‌లో చేసిన సందర్శన ఫలితాలను చర్చించారు. ట్రంప్ పుతిన్‌కు ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధానికి త్వరగా ముగింపు కావాలని కోరారు, ఇది అమెరికా-రష్యా సంబంధాలను పూర్తిగా పునరుద్ధరించడానికి సహాయపడుతుందని క్రెమ్లిన్ తెలిపింది. ఈ సందర్భంగా, పుతిన్ యూరోప్ పట్ల రష్యాకు దురాశలు లేవని ట్రంప్‌కు హామీ ఇచ్చారు. పుతిన్ విదేశీ వ్యవహారాల సలహాదారు యూరీ ఉషాకోవ్, పుతిన్ మరియు ట్రంప్ మధ్య జరిగిన ఈ గంటల సంభాషణ 'సంఘటితమైన మరియు చాలా స్పష్టమైనది' అని పేర్కొన్నారు. విట్కాఫ్ మరియు కుష్నర్ చేసిన సందర్శన ఫలితాలను మాస్కో సానుకూలంగా చూస్తుందని ఆయన చెప్పారు. 'డొనాల్డ్ ట్రంప్ యుద్ధాన్ని త్వరగా ముగించాలనే తలంపును స్పష్టంగా వ్యక్తం చేశాడు, ఇది అమెరికా మరియు రష్యా మధ్య సంబంధాలను పునరుద్ధరించడానికి అద్భుతమైన అవకాశాలను తెరవగలదు' అని ఉషాకోవ్ చెప్పారు. 'ఈ దృష్టిలో, ఇది వాణిజ్య మరియు ఆర్థిక సంబంధాలపై ప్రత్యేక ప్రభావం చూపుతుంది, రెండు దేశాలకు భారీ లాభాలను అందించగలదు. ట్రంప్ తన అధ్యక్షతలో ఒక ప్రగతి సాధించాలని ఆసక్తిగా ఉన్నాడు. ఈ దృష్టిని పుతిన్ మద్దతు ఇచ్చారు'. ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధం ముగించేందుకు ట్రంప్ మరియు పుతిన్ మధ్య జరిగిన ఈ సంభాషణలో యూరోపియన్ దేశాల పట్ల రష్యా యొక్క దురాశల గురించి చర్చ జరిగింది. 'యూరోప్ పట్ల మాకు ఏ దురాశలు లేవు' అని ఉషాకోవ్ చెప్పారు. ఈ కాల్‌పై వైట్ హౌస్ లేదా అమెరికా అధ్యక్షుడి నుండి వెంటనే స్పందన లేదు. అమెరికా శాంతి చర్చకర్తలు జారెడ్ కుష్నర్ మరియు స్టీవ్ విట్కాఫ్ మాస్కో మరియు కీవ్‌లో పుతిన్ మరియు ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలొదిమిర్ జెలెన్స్కీతో వేర్వేరు చర్చలకు వెళ్లారు. ఈ సమావేశాలు యుద్ధాన్ని ముగించేందుకు ప్రధానమైన ప్రగతి సాధించలేకపోయాయి, మరియు రెండు దేశాలు శుక్రవారం జరిగిన శాంతి విరమణ తర్వాత తమ వాయు యుద్ధాన్ని కొనసాగించాయి. మంగళవారం స్థానిక అధికారులు తెలిపిన ప్రకారం, రష్యా కీవ్ నగరాన్ని డ్రోన్లు మరియు మిస్సైల్‌లతో బాంబు విసిరినప్పుడు రెండు వ్యక్తులు మరణించారు. మరోవైపు, ఉక్రెయిన్ దాడిలో క్రిమియాలో రెండు వ్యక్తులు మరణించారు. ఇటీవల నెలలుగా, రష్యా మరియు ఉక్రెయిన్ ఒకదానికొకటి నష్టపరిహారం చెల్లించేందుకు తమ వాయు యుద్ధాన్ని పెంచాయి. ఈ రోజు ముందుగా, రష్యా అధ్యక్షుడి ప్రాతినిధి దిమిత్రి పెస్కోవ్, 'రష్యాకు విజయానికి దగ్గరగా ఉన్నామని' చెప్పారు, 'విజయం చాలా దగ్గరగా ఉంది' అని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు అంతర్జాతీయ రాజకీయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ , దౌత్య సంబంధాల నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య శుక్రవారం కీలక ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్య బంధం, అంతర్జాతీయ రవాణా ప్రాజెక్టులతో పాటు ముఖ్యంగా సుదీర్ఘంగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి శాంతియుత ముగింపు పలకడమే లక్ష్యంగా ఈ భేటీ సాగనుందని రష్యా అధికారిక కార్యాలయం 'క్రెమ్లిన్' ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పష్టం చేశారు. 11న ఢిల్లీ వేదికగా భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఆ సమావేశానికి ముందే మోదీ – పుతిన్ ఒకరిని ఒకరు కలవబోతున్నారు. అనంతరం ఇరు దేశాల ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. యుద్ధ పరిష్కారం కోసం భారత్ చూపిస్తున్న నిబద్ధతను, చొరవను రష్యా మనస్ఫూర్తిగా స్వాగతిస్తోందని ఆయన వెల్లడించారు. అసలు తాము ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకోలేదని, గతంలో మొదలైన ఈ వివాదానికి శాంతియుతంగా చుక్కాని పెట్టడానికే రష్యా ప్రయత్నిస్తోందని చెప్పారు. రష్యా, ఉక్రెయిన్ , అమెరికా మధ్య మళ్లీ శాంతి చర్చలు ప్రారంభమవుతాయని తాము ఆశిస్తున్నామని, శాంతి పునరుద్ధరణ కోసం భారత్‌తో పాటు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు కూడా ఆహ్వానించదగినవేనని కొనియాడారు. శాంతి ప్రక్రియ ముందుకు సాగాలంటే కేవలం తమ వైపు నుంచే కాకుండా ఉక్రెయిన్ నుంచి కూడా అంతే సుముఖత ఉండాలని రష్యా స్పష్టం చేసింది. కొన్ని ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌ను నిరంతరం రెచ్చగొడుతూ శాంతి చర్చలను పక్కదారి పట్టించేందుకు కుట్ర పన్నుతున్నాయని పెస్కోవ్ సంచలన ఆరోపణలు చేశారు. అయితే ఆ విదేశీ కుట్రలు ఫలించకుండా తాము అడ్డుకుంటామని, శాంతి మార్గంలోనే పరిష్కారాన్ని అన్వేషిస్తామని పునరుద్ఘాటించారు. ఈ ఇరువురి భేటీలో నైనా రష్యా యుద్ధం ముగింపుకు స్వస్తి పలకాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# భారత నాయకత్వానికి ప్రశ్నార్థకంగా బ్రిక్స్ సదస్సు



భారత్ అధ్యక్షతన సెప్టెంబర్ 12–13 తేదీలలో న్యూఢిల్లీలో జరుగనున్న ప్రతిష్టాత్మక 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు అంతర్జాతీయ వ్యవహారాలలో భారత్ నాయకత్వంకు ప్రశ్నార్థకంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొదటగా, పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణల దృష్ట్యా ఉమ్మడి ప్రకటన సాధ్యమా? అనే ప్రశ్న తలెత్తుతుంది. బ్రిక్స్ సభ్యత్వం ఆశిస్తున్న బంగ్లాదేశ్ ప్రతినిధిగా ఆ దేశ ప్రధాని తారిక్ రెహమాన్ హాజరవుతారా? అన్నది సందేహాస్పదంగా ఉంది. పైగా, బ్రిక్స్ ఏర్పాటై 20 ఏళ్లు పూర్తవుతున్నందున, ఈ సంవత్సరం ఒక ముఖ్యమైన మైలురాయిగా కూడా నిలుస్తుంది. అంతర్జాతీయ ఉద్రిక్తతల మధ్య జరిగిన గత బ్రిక్స్ సమావేశంలో బ్రెజిల్ అధ్యక్షుడు ఉమ్మడి ప్రకటన చేయించగలిగారు. తాజాగా బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సదస్సులో సైతం ఉమ్మడి ప్రకటన వెలువడింది. ఇరాన్ బ్రిక్స్ సభ్యదేశమైనప్పటికీ ఆ దేశంపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేస్తున్న సమయంలో భారత్ బ్రిక్స్ అధ్యక్ష హోదాలో స్పష్టంగా ఖండించకపోవడం, యుద్ధం ఆపేందుకు క్రియాశీల పాత్ర వహించకపోవడం సహజంగానే అంతర్జాతీయ వ్యవహారాలలో భారత్ పాత్రపట్ల సందేహాలను రేకెత్తిస్తున్నది. ఉగ్రవాదానికి అడ్డాగా పేరొందిన పాకిస్థాన్ అమెరికా– ఇరాన్‌ల మధ్య సయోధ్య కోసం ప్రయాణించగలగడం ఓ విధంగా భారత్‌కు తలవంపు కలిగించే విషయమే.

# ఇస్రో భవితపై నీలినీడలు?




దశాబ్దాలుగా భారత అంతరిక్ష రంగానికి దిక్సూచిగా నిలిచిన అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)పై తాజాగా తలెత్తిన వివాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇస్రోను ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ తొమ్మిది ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేయడంతో ఈ అంశం ఒక్కసారిగా చర్చనీయాంశమైంది. సంస్థ ప్రైవేటీకరణకు ఎలాంటి ప్రతిపాదన లేదని ఇస్రో చైర్మన్ నారాయణన్ స్పష్టం చేసినప్పటికీ ఉద్యోగుల్లో నెలకొన్న సందేహాలకు పూర్తిగా తెరపడలేదు. ఇస్రోను ప్రైవేటీకరిస్తున్నారన్నదే కాదు.. ఇస్రో కార్యకలాపాల్లో ప్రైవేటు రంగం భాగస్వామ్యం క్రమంగా పెరుగుతోందన్నది కూడా ఆందోళన కలిగించే అంశమే. అంతరిక్ష రంగంలో సంస్కరణల అనంతరం ప్రైవేటు సంస్థలకు గతంలో ఎన్నడూ లేనంతగా అవకాశాలు లభిస్తున్నాయి. ప్రపంచ అంతరిక్ష రంగం శరవేగంగా విస్తరిస్తున్న తరుణంలో భారతదేశం కూడా వాణిజ్యపరమైన అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడంలో తప్పు లేదు. అయితే ఆ ప్రక్రియలో ఇస్రో ప్రాధాన్యం, స్వతంత్ర ప్రతిపత్తి దెబ్బతినకుండా చూడటం అత్యంత కీలకం. ఇప్పటికే దేశంలో 400కుపైగా స్పేస్‌టెక్ స్టార్టప్‌లు ఏర్పడ్డాయి. స్కైరూట్ ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్ వంటి సంస్థలు రాకెట్ల తయారీలో తమ సామర్థ్యాన్ని చాటుతున్నాయి. మొన్న జులైలో స్కైరూట్ రూపొందించిన విక్రమ్–1 ప్రయోగం భారత ప్రైవేటు అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఇక బెలాట్రిక్స్ ఏరోస్పేస్, మానస్తు వంటి సంస్థలు కూడా ప్రొపల్షన్ సహా వివిధ అత్యాధునిక సాంకేతిక రంగాల్లో పనిచేస్తున్నాయి. భారత్‌లో బలమైన ప్రైవేటు అంతరిక్ష పరిశ్రమకు బీజం పడిందనడానికి ఇవే ఉదాహరణలు. ఇక ఇస్రోకు ప్రైవేట్ పరిశ్రమలతో అనుబంధం కొత్తది కాదు. సంస్థకు అవసరమైన విడిభాగాలు, పరికరాలను ప్రైవేటు పరిశ్రమలు చాలాకాలంగా సరఫరా చేస్తున్నాయి. ఇప్పుడు ఆ పరిధి మరింత విస్తరిస్తోంది. ఇస్రో అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశ్రమలకు బదిలీ చేయడం కూడా ఇందులో భాగమే. చిన్న ఉపగ్రహ ప్రయోగ వాహనం (ఎస్ఎస్–ఎల్వి) తయారీ సాంకేతిక పరిజ్ఞానాన్ని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌కు ఇస్రో బదిలీ చేయడం ఇందుకు ఉదాహరణ. ఇలాంటి సాంకేతిక బదిలీ ఒప్పందాలు వందకు చేరుకోవడం కూడా గమనార్హం. అయితే ఇక్కడే అసలు ప్రశ్న తలెత్తుతోంది. ఇస్రో అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానం ప్రైవేటు పరిశ్రమలకు బదిలీ చేయడం ద్వారా దేశానికి మేలు జరుగుతుందా? లేక భవిష్యత్తులో ఇస్రో తన సాంకేతిక సామర్థ్యాలను కోల్పోయే పరిస్థితి వస్తుందా?.. ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం అవసరం. ఆర్యభట్ట నుంచి చంద్రయాన్–3 వరకు, మంగళ్‌యాన్ నుంచి ఆదిత్య–ఎల్1 వరకు ఎన్నో అద్భుత విజయాలను సాధించిన సంస్థ ఇస్రో. ద

పరిమిత వనరులతో ప్రపంచంలోని ప్రముఖ అంతరిక్ష సంస్థల సరసన భారత్‌ను నిలబెట్టిన ఘనత ఈ సంస్థ సొంతం. అంతరిక్ష పరిశోధనతోపాటు దేశరక్షణ, వాతావరణ అంచనాలు, వ్యవసాయం, విపత్తు నిర్వహణ, కమ్యూనికేషన్ వంటి అనేక రంగాలకు ఇస్రో అందిస్తున్న సేవలు అపారమైనవి. అందువల్ల ఇస్రోను కేవలం రాకెట్లు తయారు చేసే సంస్థగా చూడటం పొరపాటు. అది దేశ శాస్త్రీయ, సాంకేతిక సామర్థ్యానికి ప్రతీక. ఆ సంస్థను మరింత బలోపేతం చేయాల్సిన సమయంలో ఉద్యోగుల్లో ప్రైవేటీకరణ భయాలు నెలకొనడం మంచి పరిణామం కాదు. గత కొన్నేళ్లుగా ఉద్యోగుల సంఖ్య, నైపుణ్యం కలిగిన మానవ వనరుల వలస వంటి అంశాలపై తలెత్తుతున్న సందేహాలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి.

ప్రైవేటీకరణ జరగదని ఇస్రో చైర్మన్ ఇచ్చిన హామీకి విధానపరమైన స్పష్టత కూడా తోడైతే ఉద్యోగుల ఆందోళనలకు తెరపడుతుంది. ఇస్రోలో ఏ కార్యకలాపాలు కొనసాగాలి? ప్రైవేటురంగానికి ఏ బాధ్యతలు అప్పగించాలి? కీలక సాంకేతిక పరిజ్ఞానంపై తుది నియంత్రణ ఎవరిది? భవిష్యత్తులో ఇస్రో మానవ వనరులను ఎలా బలోపేతం చేయాలి? వంటి అంశాలపై స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించాల్సిన సమయం ఇదే. ఇస్రో, ప్రైవేటు రంగం పరస్పర ప్రత్యర్థి సంస్థలు కాదు. ఒకటి పరిశోధనకు, జాతీయ ప్రయోజనాలకు వెన్నెముకగా ఉంటే.. మరొకటి ఆ సాంకేతికతను వాణిజ్యపరంగా విస్తరించే శక్తిగా నిలవాలి. రెండూ కలిసి పనిచేస్తే భారత అంతరిక్ష రంగం ప్రపంచంలో మరింత ఉన్నత స్థానానికి చేరుతుంది. అయితే ఆ ప్రయాణంలో ఇస్రో స్వతంత్రతపై నీలినీడలు కమ్ముకోకూడదు. అంతరిక్షంలో భారత పతాకం ఎగరడానికి ఇస్రో బలమే పునాది. ఆ పునాదిని మరింత పటిష్ఠం చేయడమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత కావాలి.

# ప్రజల గొడవే.. కాళోజీ గొడవ



అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి/ అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి అంటూ ప్రజల గొడవను తన గొడవగా చెప్పినవాడు. పరుల కష్టం చూసి పగిలిపోవును గుండె /మాయ మర్మము చూసి మండిపోవును ఒళ్ళు అంటూ తన సున్నితపు మనసును ఆవిష్కరించిన మానవీయకవి, అన్నపు రాశులు ఒకచోట ఆకలి మంటలు ఒకచోట/ సంపదలన్నీ ఒకచోట గంపెడు బలగం ఒకచోట అంటూ సమసమాజ నిర్మాణానికి కదం తొక్కిన ఉద్యమవీరుడు. కోటిన్నర మేటి ప్రజల గొంతొక్కటి గొడవ ఒక్కటి/ తెలంగాణ నిలిచి గెలిచి ఫలించాలి భారతాన అని స్వప్నించిన ప్రజాకవి కాళోజీ. పోరుగడ్డ ఓరుగల్లులో ఉద్భవించిన ఒక నిప్పుకణం దావానలంగా మారి యావత్ తెలంగాణలో ఉద్యమ ఆకాంక్షలను రేకెత్తించి వీర తెలంగాణ నుదుటన సింధూరమైన నిలిచింది. ఆ నిప్పుకణం పేరు కాళోజీ. మనిషి జీవితంలో ఉద్యమం ఒక భాగం కావడం సహజం కానీ జీవితమే ఉద్యమంగా మారడం కేవలం కాళోజీలోనే చూసాం. నిజాం రాజ్యాన్ని ప్రతిఘటించడం దగ్గర నుండి నక్సలైట్లపై హింసను ఖండించే వరకు ఆయన అలుపెరుగని పోరాటం చేస్తూనే ఉన్నారు. ఆర్యసమాజ్ కార్యకలాపాలు, గ్రంథాలయ ఉద్యమం, ఆంధ్ర మహాసభ, భారత స్వాతంత్ర్య పోరాటం, హైదరాబాద్ విమోచన ఉద్యమం ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటం, పౌర హక్కులు, తెలంగాణ ఉద్యమం ఇలా ఈ గడ్డను తాకిన, శాసించిన ఏ ఉద్యమానికైనా కాళోజీ తన రెండు చేతులతో ఆహ్వానం పలికి ఆవాహన చేసుకున్నాడు ఉద్యమకారుడుగానే మాత్రమే కాక కవిగా, కథకుడిగా ఉద్యమాలకు ఆలంబనయ్యాడు ఈ క్రమంలో మూడుసార్లు జైలు జీవితం అనుభవించాడు. కాళోజీ ఒక బక్క పలుచని మనిషి అయినా ఆయన శరీరంలో వజ్రతుల్యమైన ఒక దీక్ష ప్రచండ వాయువు లాంటి ఆవేశం దాగి ఉన్నాయి. 1914 సెప్టెంబర్ 9న ఇప్పటి కర్ణాటకలోని బీజాపూర్ జిల్లాలోని రెట్టిహళ్లి గ్రామంలో ఆయన జన్మించాక కుటుంబం అక్కడనుండి వరంగల్ జిల్లాలోని మడికొండకు వచ్చి స్థిరపడింది. తల్లికి ద్వితీయ పుత్రుడిగా తెలంగాణ తల్లికి అద్వితీయ పుత్రుడుగా గుర్తింపు పొందాడు. జీవిత పరిశీలన, పోరాటానుభవాలు కాళోజీలో గాఢమైన తాత్విక దృష్టికి కారణమైనాయి. తల్లి నుండి కన్నడ తండ్రి నుండి మరాఠి సానెగురూజీ వంటి సాధువుల నుండి నిరాడంబరత నేర్చుకున్నాడు. గార్లపాటి రాఘవరెడ్డి శిష్యరికంవల్ల కవిత్వ పరిమళాలను వెదజల్లి సమాజ శ్రేయస్సుకోసం పాటుపడ్డాడు పోరాట నిరాడంబరత ఆయన జీవితం. ఆయన సంభాషణలో తెలంగాణ యాస భాష ఎంతో సహజంగా, స్వచ్ఛంగా, సరళంగా ఉంటాయి.

కవిగాను, అనువాదకుడిగాను ఆయన పండితులను, సాహిత్య విమర్శకులను చాలా గౌరవంగా చూడటం ఆశ్చర్యం. విశ్వనాథ సత్యనారాయణ భావజాలంతో ఎంత విభేదించేవాడో ఆయన వ్యక్తిత్వాన్ని, పాండిత్యాన్ని అంత గౌరవించేవాడు. ఆయనకు ప్రత్యేక ఆస్తి అంటూ ఏమీ లేదు చిన్నప్పటినుండి అన్న అయిన రామేశ్వరరావు ఆయన అవసరాలను తీర్చుకుంటూ వచ్చాడు. అప్పట్లో తెలంగాణ గడ్డపై సమాంతరంగా సాగిన పలు ఉద్యమాలకు కాళోజీ ఇల్లు కేంద్రంగా ఉండేది. ఈ ఉద్యమాలన్నీ సామాజిక జీవితంలోకి తెచ్చిన విలువలలోని మంచిని స్వీకరించడంవల్ల కావచ్చు కాళోజీకి తనదైన విశిష్ట వ్యక్తిత్వం అలబడింది. సమాజ సంఘర్షణల వెంట నడిచిన వ్యక్తి కాబట్టే కాళోజీ మన హృదయాలలో సుస్థిర స్థానం స్థాపించుకున్నాడు. కవులు, విమర్శకులు చెప్పుకునే భాష, భావం, శిల్పం, ధ్వని, అలంకారాలు ఇలాంటివి పట్టించుకోకుండా తాను చెప్పదలుచుకున్నది కుండబద్దలు కొట్టినట్లు చెప్పడమే కాళోజీ కవిత్వం. ఆయన ఎజెండా కేవలం ప్రజలు. వాళ్లకు ఏమాత్రం ఇబ్బంది కలిగినా అవతల వ్యక్తి ఎంత పెద్ద నాయకుడైనా, ఎంత ఆత్మీయుడైన, ఎంత ధనవంతుడైన, చివరికి ఆ భగవంతుడే ఉన్నా కాళోజీ ఎదిరించి తీరుతాడు ఈ లక్షణాలే కాళోజీని ప్రజాకవి చేసింది. కాళోజీ బయటకు ఎంత గంభీరంగా ఉండేవారో లోపల అంత సున్నితమైన హృదయం ఆయనది. అతి చిన్న విషయాలకు కూడా తీవ్రంగా చలించిపోయేవారు. ఆయన మిత్రులు, ఉద్యమ నేతలు, కవులు, కళాకారులతోనే రోజంతా మాట్లాడుతుంటే ఉండేవారు వాళ్ళు ఉన్నప్పుడు ఆయన ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా కనిపించేవారు వారు లేనప్పుడు ఒక్కసారిగా మౌనిలా మారిపోయేవాడు పుస్తకాలు చదువుకోవడం, లేదంటే ఒక్కడే పేక ముక్కలు వేసుకుని ఆడేవాడు అన్నింటికీ మించి ఆయనకు క్రికెట్ అంటే ప్రాణం సచిన్ టెండుల్కర్ అంటే ఆయనకు విపరీతమైన అభిమానం. కాళోజీ అంటే ఓ నిర్భీతికి ప్రతీక, ఓ ధిక్కార స్వరం, ఓ చెమ్మగిల్లిన కన్ను, ఓ ప్రవక్త, ఓ ప్రజాకవి ఒక్క మాటలో చెప్పాలంటే ఓ నికార్సయిన తెలంగాణ బిడ్డ. ఆయనను స్మరించుకోవడం అంటే ఆయన వ్యక్తిత్వాన్ని, ఆయన వదిలిన వెళ్లిన విలువలని గౌరవించడం, అంతకుమించి ఆచరించడం. అలా ఆచరించగలిగినప్పుడే కాళోజీకి నిజమైన నివాళి సమర్పించినట్లు అవుతుంది. ప్రాంతం వాడే దోపిడీ చేస్తే ప్రాణం తోనే పాతరేస్తాం అన్న ఆయన ఉద్యమ భావన ఇంకా మిగిలి ఉంది. ఈ మిగిలిన దాన్ని తెలంగాణ ప్రజలు ఆఖరి గొడవగా ఉద్యమించవలసింది ఇంకా ఉండనే ఉంది. ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కులను పరిరక్షించే బాధ్యత మనకు ఉందంటూ కాళోజీ ఎల్లప్పుడూ మనకు గుర్తు చేస్తూనే ఉంటాడు.

# మొండి బాకీల భారం ఎవరిపై?




భారతదేశంలో బ్యాంకింగ్ వ్యవస్థపై చర్చ జరిగినప్పుడల్లా ఒక ప్రశ్న తప్పక ముందుకు వస్తుంది. సాధారణ రుణగ్రహీత ఒక్క వాయిదా చెల్లించకపోయినా బ్యాంకు నోటీసులు, జరిమానాలు, ఆస్తుల స్వాధీనం వంటి చర్యలు ఎదుర్కోవాల్సి వస్తే, వేల కోట్ల రూపాయల అప్పులు తీసుకున్న పెద్ద కార్పొరేట్ సంస్థల విషయంలో వ్యవస్థ ఎందుకు ఇంత సంక్లిష్టంగా, సౌమ్యంగా వ్యవహరిస్తుంది? ఈ ప్రశ్నకు సమాధానం కేవలం రాజకీయ ఆరోపణల్లోనూ లేదు, ప్రభుత్వ వివరణల్లోనూ పూర్తిగా లేదు. బ్యాంకు రుణాల రైట్- ఆఫ్‌లు, దివాలా పరిష్కారాలు, హెయిర్‌కట్‌లు, పన్ను రాయితీలు ఇవన్నింటినీ కలిపి చూస్తేనే అసలు చిత్రం కనిపిస్తుంది. మొదట ఒక ముఖ్యమైన అపోహను తొలగించాలి. రైట్–ఆఫ్ అంటే ప్రభుత్వం లేదా బ్యాంకు రుణాన్ని నేరుగా మాఫీ చేయడం కాదు. బ్యాంకు తన పుస్తకాలలో వసూలు కావడం అనుమానాస్పదమైన రుణాన్ని తొలగించి, దానికి అవసరమైన నష్టాన్ని ఇప్పటికే చేసిన ప్రొవిజన్ల ద్వారా గుర్తించే అకౌంటింగ్ ప్రక్రియ. రుణగ్రహీతపై బాకీ మాత్రం చట్టపరంగా కొనసాగుతుంది. వసూళ్లు సాధ్యమే. అందువల్ల రైట్- ఆఫ్ అంటే నేరుగా రుణమాఫీ అని చెప్పడం సాంకేతికంగా సరైంది కాదు.

# భారత్, ఆఫ్ఘనిస్తాన్ సిరీస్‌కు వైభవ్

భారత్, ఆఫ్ఘనిస్తాన్ జట్లు సెప్టెంబర్ 13వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడనున్నాయి. శ్రేయస్ అయ్యర్ భారత జట్టుకు సారథ్యం వహించనుండగా.. తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ఈ సిరీస్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాడు. ఈ సిరీస్‌లో అన్ని మ్యాచ్ లు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరగనున్నాయి. టీమిండియాలో పలు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. సంజూ శాంసన్, జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి రాగా.. జింబాబ్వే పర్యటనలో ఉన్న రింకూ సింగ్‌ను ఈ మ్యాచ్‌ల నుంచి తొలగించారు. ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ పూర్తి ఫిట్‌నెస్ సాధించగా.. జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, నితీష్ కుమార్ రెడ్డిల సెలెక్షన్ వారి ఫిట్‌నెస్ ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. మరోవైపు ఆఫ్ఘనిస్తాన్ జట్టుకు ఇబ్రహీం జద్రాన్ నాయకత్వం వహిస్తున్నారు. ఇండియాలో ఈ టీ20 సిరీస్ సోనీ స్పోర్ట్స్ నెట్వర్క్ లో ప్రత్యక్షప్రసారం కానుంది. అలాగే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో చూడాలనుకునే అభిమానులు ఫ్యాన్‌కోడ్ యాప్, వెబ్‌సైట్ ద్వారా లైవ్ స్ట్రీమింగ్ ను వీక్షించవచ్చు. ఈ మూడు మ్యాచ్‌లు సాయంత్రం 7:00 గంటలకు ప్రారంభమవుతాయి. భారత క్రికెట్ అభిమానులు ఈ సిరీస్‌లో ఉత్కంఠభరితమైన పోటీలను ఆశించవచ్చు. వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు . టీమిండియా జట్టు : శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డిలి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా . ఆఫ్ఘనిస్థాన్ జట్టు: ఇబ్రహీం జద్రాన్ (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), నూర్ రెహ్మాన్ (వికెట్ కీపర్), సెడిఖుల్లా అటల్, దర్విష్ రసూలీ, అజ్మతుల్లా



ఉమర్‌జాయ్, గుల్బాదిన్ నాయబ్, మహ్మద్ నబీ, రషీద్ ఖాన్, నంగియలై ఖరోటి, నూర్ అహ్మద్, ముజీబుర్ రెహ్మాన్, ఫజల్ హక్ ఫరూకీ, అబ్దుల్లా అహ్మద్‌జాయ్, నవీన్-ఉల్-హక్ భారత్-ఆఫ్ఘనిస్తాన్ టీ20 సిరీస్ పూర్తి షెడ్యూల్ మొదటి టీ20 - సెప్టెంబర్ 13, 2026, అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ) రెండో టీ20 - సెప్టెంబర్ 15, 2026, అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ) మూడో టీ20ఐ - సెప్టెంబర్ 17, 2026, అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ)

# బెంగళూరుకు హార్దిక్ పాండ్యా!



భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఇకపై బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను తన శాశ్వత శిక్షణా కేంద్రంగా మార్చుకుంటూ బెంగళూరుకు తరలివెళ్లాడు. దీంతో బీసీసీఐ అత్యాధునిక శిక్షణా కేంద్రాన్ని శాశ్వత ప్రాక్టీస్ బేస్‌గా ఎంచుకున్న మొదటి భారత క్రికెటర్‌గా హార్దిక్ నిలవనున్నాడు. సాంప్రదాయకంగా భారత కేంద్ర ఒప్పంద ఆటగాళ్లు ప్రధానంగా గాయాల పునరావాసం, ఫిట్‌నెస్ మూల్యాంకనాలు లేదా జాతీయ జట్టు శిబిరాల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సందర్శిస్తారు. పాండ్యా నిర్ణయం ఆ పద్ధతికి ఒక ముఖ్యమైన విచలనాన్ని సూచిస్తుంది. ఈ ఆల్‌రౌండర్ అంతర్జాతీయ, ఐపీఎల్ లేదా దేశీయ విధుల్లో లేనప్పుడల్లా అక్కడ శిక్షణ తీసుకోవాలని యోచిస్తున్నాడు. పాండ్యా స్వస్థలం గుజరాత్‌లోని బరోడా అయినప్పటికీ, అతను గత దశాబ్దంలో ఎక్కువ భాగం ముంబైలోనే గడిపాడు. అక్కడ అతను ప్రధానంగా ఘన్సోలిలోని ముంబై ఇండియన్స్ హై-పెర్ఫార్మెన్స్ ఫెసిలిటీలో శిక్షణ పొందాడు. 32 ఏళ్ల అతను ప్రస్తుతం క్వాడ్రిసెప్స్ గాయం నుంచి కోలుకుంటున్నాడు. గాయం కారణంగా అతను యూకేలో జరుగుతున్న భారత వైట్-బాల్ పర్యటనకు దూరమయ్యాడు. 6 నెలలుగా తన పునరావాసం, శిక్షణా కార్యక్రమంలో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గణనీయమైన సమయాన్ని గడిపాడు. 'హార్దిక్ ఇప్పటికే శాశ్వతంగా బెంగళూరుకు మారాడు. అతను నగర శివార్లలో, సీఓఈకి సమీపంలో ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. తన కెరీర్‌లో మిగిలిన కాలానికి సీఓఈని తన శాశ్వత శిక్షణా కేంద్రంగా చేసుకున్న మొదటి భారత క్రికెటర్ అతనే అవుతాడు.' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. శిక్షణ కోసం తన లోయర్ పరేల్ నివాసం నుంచి ప్రతిరోజూ ప్రయాణించడం రోజురోజుకూ అసౌకర్యంగా మారడంతో పాండ్యా ముంబైని విడిచి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. తన లోయర్ పరేల్ నివాసం నుంచి శిక్షణ కోసం ప్రతిరోజూ ప్రయాణించడం సమస్యగా మారడంతో హార్దిక్ ముంబై నుంచి బయటకు వెళ్లాలనుకున్నాడు. కేంద్ర కాంట్రాక్ట్ క్రికెటర్‌గా, గాయాల నిర్వహణ నుంచి నైపుణ్య శిక్షణ వరకు జూజులోని ప్రతి సదుపాయం అతనికి అందుబాటులో ఉంది. 'అందుకే, అతను ఐపీఎల్, రాష్ట్ర లేదా జాతీయ విధుల్లో లేనప్పుడు సీఓఈని తన శాశ్వత స్థావరంగా మార్చుకోవాలని నిర్ణయం తీసుకున్నాడు.' అని ఆ వర్గాలు తెలిపాయి. సీఓఈ నిర్దేశిత కార్యక్రమాలకు వెలుపల, పాండ్యా తన సొంత ఫిజియోథెరపిస్ట్, వ్యక్తిగత స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్‌తో కలిసి పనిచేయనున్నాడు. వీరు అతని శిక్షణా దినచర్యలను పర్యవేక్షిస్తారు. 'అతను దేశం తరఫున వైట్ బాల్ క్రికెట్ ఆడుతున్నంత కాలం తన స్థావరాన్ని బెంగళూరుకు మార్చుకున్నట్లే. అతను కనీసం మరో ఐదు, ఆరేళ్లపాటు ఆడాలని భావిస్తున్నాడు. సీఓఈ నియమించిన నెట్ బౌలర్లకు వ్యతిరేకంగా బ్యాటింగ్ చేయడం వంటి నైపుణ్య శిక్షణ చేసినప్పుడు కూడా, హార్దిక్ వారికి తన సొంత జేబు నుంచే డబ్బు చెల్లిస్తాడు.' అని క్రికెట్ వర్గాలు తెలిపాయి.

# టైటిల్ దిశగా దూసుకెళ్తున్న ఈస్ట్ జోన్

దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ ఆధిపత్యం మూడో రోజు కూడా కొనసాగింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇషాన్ కిషన్ (270) డబుల్ సెంచరీతో 708 పరుగుల భారీ స్కోరు సాధించిన ఈస్ట్ జోన్, ఆ తర్వాత బౌలింగ్‌లోనూ సౌత్ జోన్‌ను ఇబ్బంది పెడుతోంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసి, ఇంకా 466 పరుగులు వెనుకబడి ఉంది. బ్యాటింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై మహమ్మద్ షమీ, ముకేష్ కుమార్‌లు తమ బౌలింగ్‌తో సౌత్ జోన్ టాప్ ఆర్డర్‌ను పడగొట్టారు. సౌత్ జోన్ ఓపెనర్ నారాయణ్ జగదీషన్ (32) వేగంగా పరుగులు సాధించే ప్రయత్నం చేసి ముకేష్ కుమార్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత మంచి ఫామ్‌లో ఉన్న దేవదత్ పడిక్కల్ (62) హాఫ్ సెంచరీ బాది నిలకడగా ఆడాడు. షేక్ రషీద్ (27)తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేస్తుండగా, సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ రివర్స్ స్వింగ్‌తో రషీద్‌ను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేశాడు. ఆ వెంటనే పడిక్కల్‌ను ముకేష్ కుమార్ డీప్ స్క్వేర్ లెగ్‌లో క్యాచ్ ఔట్ చేయడంతో సౌత్ జోన్ కోలుకోలేని దెబ్బతింది. ఈ మ్యాచ్‌లో మరొక ప్రధాన ఆకర్షణ 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ డీఆర్‌ఎస్ నిర్ణయాలు. కెప్టెన్ ఇషాన్ కిషన్ మైదానం వెలుపల ఉన్న సమయంలో స్టాండ్-ఇన్ కెప్టెన్‌గా




వ్యవహరించిన సూర్యవంశీ, మైదానంలో చురుగ్గా నిర్ణయాలు తీసుకున్నాడు. రికీ భుయ్ క్యాచ్ ఔట్ విషయంలోనే కాకుండా, షమీ బౌలింగ్‌లో రవిచంద్రన్ బ్యాట్ అంచుకు బంతి తగిలిన విషయాన్ని కీపర్ సహాయంతో గుర్తించి సూర్యవంశీ రివ్యూ తీసుకున్నాడు. అల్ట్రా ఎడ్జ్‌లో ఎడ్జ్ అయినట్లు తేలడంతో రవిచంద్రన్ (23) వెనుతిరగాల్సి వచ్చింది. వికెట్లు పడుతున్నా.. సౌత్ జోన్ సారథి తిలక్ వర్మ పోరాడుతున్నాడు. 133 బంతుల్లో 56 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచిన తిలక్, శ్రేయాస్ గోపాల్ (26)తో కలిసి ఆరో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. అయితే ఆట ముగిసే సమయంలో శ్రేయాస్ గోపాల్‌ను కౌనైన్ ఖురైషి ఔట్ చేశాడు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమాయనికి సౌత్ జోన్ 6 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. ఈస్ట్ జోన్ బౌలర్లలో షమీ 2, ముకేష్ కుమార్ 2 వికెట్లు తీయగా.. ఖురేషీ, శిఖర్ మోహన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.



# యూఎస్ ఓపెన్‌లో మరో సంచలనం

- కర్లోస్ అల్కరాస్‌కు క్వార్టర్ ఫైనల్‌లో భారీ షాక్
- అమెరికన్ ఆటగాడు బెన్ షెల్టన్ చేతిలో ఓటమి



యూఎస్ ఓపెన్‌లో మరో సంచలనం నమోదైంది. డిఫెండింగ్ ఛాంపియన్ స్పానిష్ టెన్నిస్ స్టార్ కర్లోస్ అల్కరాస్‌కు క్వార్టర్ ఫైనల్‌లో భారీ షాక్ తగిలింది. టైటిల్ ఫేవరెట్లలో ఒకడిగా బరిలోకి దిగిన అతడిని బెన్ షెల్టన్ (అమెరికా) ఓడించాడు. సుమారు నాలుగు గంటలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్కరాస్‌పై బెన్ షెల్టన్ 6-7, 6-1, 6-3, 1-6, 7-6 (10-7) తేడాతో నెగ్గాడు. దీంతో ట్రోఫీని నిలబెట్టుకోవాలని భావించిన అల్కరాస్ ఊహించని ఈ ఓటమితో ఇంటిబాట పట్టాడు. న్యూయార్క్‌లోని ఆర్థర్ యాశ్ స్టేడియంలో జరిగిన ఈ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ అమెరికన్ ఆటగాడు బెన్ షెల్టన్‌తో అల్కరాస్ తలపడ్డాడు. నాలుగు గంటలపాటు ఈ పోరు ఉత్కంఠభరితంగా సాగింది. గాయం తర్వాత నేరుగా ఈ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో బరిలోకి దిగిన అస్కరాస్ తొలి రౌండ్‌లో అతి కష్టంమీద నెగ్గాడు. ఈ సెట్‌ను టై బ్రేక్‌లో గెలుచుకున్నాడు. అయితే తర్వాత రెండు సెట్లలో బెన్ షెల్టన్ జోరు ప్రదర్శించాడు. వరుసగా రెండు, మూడు సెట్లను 6-1, 6-3 తేడాతో గెలుచుకొని ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. పట్టు వదలని అల్కరాస్ నాలుగో సెట్‌లో అద్భుతంగా పుంజుకున్నాడు. ఆధిపత్యం ప్రదర్శిస్తూ 6-1తో సెట్‌ను గెలుచుకున్నాడు. ఇక నిర్ణయాత్మకమైన ఐదో సెట్ తీవ్ర ఉత్కంఠతకు దారి తీసింది. పోటీ హోరాహోరీగా సాగింది. ఈ ఇద్దరు 6- 6తో సమంగా నిలిచారు. దీంతో గేమ్ టై- బ్రేక్‌కు వెళ్లింది. అయితే టై- బ్రేక్‌లో షెల్టన్ 10-7తో గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. కాగా, అల్కరాజ్‌పై షెల్టన్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. 23 ఏళ్ల అల్కరాస్ తమ కెరీర్‌లో ఎనిమిదో గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలవాలనే ఆశతో టోర్నమెంట్‌లో అడుగుపెట్టాడు. కానీ, ఈ ఓటమితో ఆ కల చెదిరిపోయింది. కాగా, అల్కరాస్ ఇప్పటిదాకా రెండుసార్లు (2022, 2025) ఖు ఓపెన్ టైటిల్ దక్కించుకున్నాడు. దీంతోపాటు ఒకసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ (2026), రెండుసార్లు ఫ్రెంచ్ ఓపెన్ (2024, 2025), రెండుసార్లు వింబుల్డన్ (2023, 2024) గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించాడు. మరోవైపు ఇంకో క్వార్టర్ ఫైనల్‌లో టియాఫో - మికెల్సన్ తలపడ్డారు. నాలుగున్నర గంటలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో మికెల్సన్‌పై 5-7, 3-6, 7-5, 6-3, 7-6 (10-6) తేడాతో టియాఫో విజయం సాధించి సెమీస్‌కు దూసుకెళ్లాడు. ఇక సెమీఫైనల్‌లో ఫ్రాన్సెస్ టియాఫోతో షెల్టన్ తలపడనున్నాడు. 23 ఏళ్ల షెల్టన్ తన మొదటి గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. అతను ఇప్పటివరకు మేజర్ గ్లాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గలేదు. 2025 ఆస్ట్రేలియన్ ఓపెన్, 2023 ఖు ఓపెన్ సెమీఫైనల్స్ వరకు వెళ్లడం అతడికి అత్యుత్తమ ప్రదర్శనలు. ఇదే టోర్నమెంట్‌లో రీసెంట్‌గా సెర్బియా టెన్నిస్ స్టార్ నొవాక్ జకోవిచ్‌కు తొలి రౌండ్‌లోనే ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. అతడిని మారియానో నావోన్ (అర్జెంటీనా) 7-6, 5-7, 6-4, 2-6, 6-1 తేడాతో ఓడించి సంచలనం సృష్టించాడు.

# ఒక్క పరుగుతో తిలక్ వర్మ సెంచరీ మిస్

దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో సౌత్ జోన్ కేప్టెన్ తిలక్ వర్మ నిరాశకు గురి చేశాడు. చెన్నైలోని చేపాక్ స్టేడియం వేదికగా ఈస్ట్ జోన్‌తో జరుగుతున్న ఈ మ్యాచ్ లో అద్భుత పోరాటపటిమను ప్రదర్శించాడు. ఒంటరి పోరాటంతో జట్టును ఇబ్బందుల నుంచి గట్టెక్కించినప్పటికీ.. ఒక్క పరుగు దూరంలో సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. 211 బంతులను ఎదుర్కొన్న తిలక్ వర్మ.. 99 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. అతను అవుట్ అయ్యాక సౌత్ జోన్ తొలి ఇన్నింగ్ ఎంతో సేపు కొనసాగలేదు. 336 పరుగులకు ఆలౌట్ అయింది. నాలుగో రోజు మధ్యాహ్నానికే ఈస్ట్ జోన్ తో 394 పరుగులు వెనుకంజలో ఉంది జట్టు. సౌత్ జోన్ లో ఇద్దరు, ముగ్గరు మినహా మిగిలిన బ్యాటర్లెవరూ పెద్దగా రాణించలేదు. ఓపెనర్ రికి భుయ్ ఒక పరుగుకే అవుట్ అయ్యాడు. నారాయణ్ జగదీశన్- 32, దేవ్ దత్ పడిక్కల్- 62, షేక్ రషీద్- 27, స్మరన్ రవిచంద్రన్- 23, శ్రేయాస్ గోపాల్- 26 పరుగులు చేశారు. చివర్లో చామా వీ మిలింద్ 43 పరుగులతో జట్టును ఆదుకున్నాడు. ఈస్ట్ జోన్ లో ముఖేష్ కుమార్ మూడు వికెట్లతో సత్తా చాటాడు. మహ్మద్ షమీ, ఖురేషీ, శిఖర్ మోహన్ రెండేసి చొప్పున వికెట్లు



పడగొట్టారు. తొలి ఇన్నింగ్ లో ఈస్ట్ జోన్ 708 పరుగులకు ఆలౌట్ అయింది. కేప్టెన్ ఇషాన్ కిషన్ 270 పరుగులతో తడాఖా చూపాడు. కుమార్ కుశాగ్ర 101తో చెలరేగాడు. ఈస్ట్ జోన్ కు ధీటుగా బదులివ్వలేకపోయింది సౌత్. తిలక్ వర్మ, దేవ్ దత్ పడిక్కల్, మిలింద్ మాత్రమే ప్రత్యర్థి బౌలర్లను ముప్పతిప్పలు పెట్టారు. ఈ క్రమంలో తిలక్ వర్మ శతకానికి చేరువ అయ్యాడు గానీ దాన్ని అందుకోలేకపోయాడు. 99 పరుగుల వద్ద ఉన్నప్పుడు మహ్మద్ కౌనైన్ ఖురేషీ బౌలింగ్‌లో అతనికే రిటర్న్ క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీ ఫైనల్ లో సెంచరీకి ఒక పరుగు దూరంలో ఇలా దురదృష్టకరంగా అవుట్ కావడం విస్మయానికి గురిచేసింది. దులీప్ ట్రోఫీ ఆరంభం నుండి తిలక్ వర్మ అసాధారణంగా ఆడుతున్నాడు. అత్యుత్తమ ఫామ్‌ను కనబరుస్తోన్నాడు. ఈ సీజన్ సెమీఫైనల్ తొలి ఇన్నింగ్స్‌లో 250 బంతుల్లో అజేయంగా 116 పరుగులు చేయడమే కాకుండా, రెండో ఇన్నింగ్స్‌లో కూడా 79 బంతుల్లో 51 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇప్పుడు మళ్లీ ఫైనల్ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో కీలక ప్రదర్శన చేసి, తన జట్టుకు బ్యాటింగ్‌లో సెంచరీకి చేరువ అయ్యాడు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక






# ఫిల్మోగ్రఫీలో అందమైన చిత్రంగా 'ఎపిక్'

బ్లాక్‌బస్టర్ చిత్రం 'బేబీ' తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్'. '90ం' వెబ్ సిరీస్‌తో సంచలనం సృష్టించిన ఆదిత్య హాసన్ ఈ చిత్రంతో దర్శకుడిగా వెండితెరకు పరిచయమవుతున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ముఖ్య అతిథులుగా హాజరై సందడి చేశారు. ఈ వేడుకలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. "90ం సిరీస్ చూసినప్పుడే, దర్శకుడు ఆదిత్యతో సినిమా చేయాలనిపించింది. తరుణ్ భాస్కర్ మొదటి సినిమా కోసం ఎలా ఎదురుచూశానో, ఆదిత్య డెబ్యూ కోసం కూడా అలాగే ఎదురుచూశాను. అలాంటి దర్శకుడి మొదటి సినిమాలో నటించే అవకాశం ఆనంద్‌కు రావడం అదృష్టం. తన సినిమాల ఎంపిక చూస్తే గర్వంగా ఉంటుంది. 'ఎపిక్' చిత్రం ఆనంద్ ఫిల్మోగ్రఫీలో ఒక అందమైన సినిమాగా నిలుస్తుందని నమ్ముతున్నాను" అని అన్నారు. తెలుగు సినిమా ఈ ఏడాది అద్భుతంగా రాణిస్తోందని, 'ఎపిక్' తో మొదలుపెట్టి వరుస బ్లాక్‌బస్టర్లు చూడబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు.

దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ, "ఆనంద్ ఐటీ జాబ్ చేసే రోజుల్లోనే సినిమాలపై తనకున్న పిచ్చి చూసి ఆశ్చర్యపోయాను. ఏ పాత్రలోనైనా సహజంగా ఒదిగిపోతాడు. దర్శకుడు ఆదిత్య రచనలో ఎంతో అనుభవం కనిపిస్తుంది. టీజర్, ట్రైలర్ బాగున్నాయి. ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు. ట్రైలర్‌పై సోషల్ మీడియాలో వస్తున్న కొన్ని నెగెటివ్ కామెంట్స్‌పై నిర్మాత నాగవంశీ, దర్శకుడు ఆదిత్య హాసన్ స్పందించారు. "నిజ జీవితంలో ఒక అబ్బాయి, అమ్మాయి మధ్య ప్రేమ ఎలా ఉంటుందో అదే స్వచ్ఛంగా చూపించాం. ఇది కుటుంబంతో కలిసి హాయిగా చూసే సినిమా. ఇందులో అశ్లీలతకు తావులేదు" అని నాగవంశీ స్పష్టం చేశారు. తనపై ప్రేక్షకులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టేలా సినిమా ఉంటుందని దర్శకుడు ఆదిత్య హాసన్ భరోసా ఇచ్చారు.


హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ, "ఇది మనందరి కథ. ట్విస్టులు, రక్తపాతాలు లేకుండా సహజంగా సాగే ప్రేమకథ. అన్నయ్య విజయ్, సందీప్ రెడ్డి గారు రావడం ఆనందంగా ఉంది" అని అన్నారు. కథానాయిక వైష్ణవి చైతన్య తన 'కడలి' పాత్ర ద్వారా ఎంతో నేర్చుకున్నానని, సందీప్ రెడ్డి సినిమాలో ఉండే హీరోయిన్ లాంటి బలమైన పాత్ర ఇదని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నటుడు శివాజీ, సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు. 'ఎపిక్' సెప్టెంబర్ 11న థియేటర్లలో విడుదల కానుండగా, సెప్టెంబర్ 10న ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నారు.

# "ఒక్క మెతుకు పొలిమేర దాటదు"..

## 'రణబాలి'గా గర్జించిన విజయ్ దేవరకొండ..

రౌడీ హీరో విజయ్ దేవరకొండ చాలా కాలం తర్వాత తన అభిమానులు కోరుకుంటున్న అసలైన మాస్ అవతారంలోకి మారిపోయారు. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. తాజాగా ఈ చిత్రం నుంచి విడుదలైన టీజర్ సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తూ సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చింది. టీజర్ ఆద్యంతం భావోద్వేగభరితంగా, ఉత్కంఠగా సాగింది. బ్రిటిష్ పాలనలో 'అన్నపూర్ణ దేశం' ఆకలితో అలమటిస్తున్న దృశ్యాలు, గుప్పెడు గింజల కోసం ప్రజలు పడుతున్న కష్టాలు హృదయాలను కదిలించాయి. ఈ క్రమంలో విజయ్ దేవరకొండ ఎంట్రీ, ఆయన చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్ టీజర్‌కే హైలైట్‌గా నిలిచాయి. "సింగనమల బొబ్బిలి రణబాలిరా నీ అక్కా..!! ఆ కొండమీదున్న మా భద్ర మల్లన్న మీద ఆనా.. నేను కాయలి కాస్తుండగా.. ఒక్క మెతుకు కూడా పొలిమేర దాటదు చెబుతున్నా" అంటూ విజయ్ చెప్పిన పవర్ ఫుల్ డైలాగ్ గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఆయన బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, పాత్రలో లీనమైన తీరు మునుపటి చిత్రాలకు భిన్నంగా ఉన్నాయి. 1854-1878 మధ్య కాలంలో, ముఖ్యంగా 1876-78లో వచ్చిన భయంకరమైన కరవు నేపథ్యంలో ఈ చిత్రం వాస్తవ సంఘటనల స్ఫూర్తితో తెరకెక్కుతున్నట్టు టీజర్ స్పష్టం చేసింది. "సముద్రాలు దాటి వచ్చిన రాకాసులు కరవు రాక్షసులుగా మారితే.. ఆకలితో చనిపోయిన 80 లక్షల మంది ఆవేశాన్ని సమాధి చేయలేరు" వంటి వాక్యాలు కథలోని తీవ్రతను, పోరాట స్ఫూర్తిని తెలియజేస్తున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, టీ-సిరీస్ సమర్పిస్తోంది. విజయ్ దేవరకొండకు జోడీగా రష్మిక మందన్న నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ క్రూరమైన ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. భారీ సెట్లు, యాక్షన్ ఘట్టాలు, నేపథ్య సంగీతం సినిమా స్థాయిని పెంచాయి. ఈ చిత్రాన్ని దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. టీజర్‌తోనే సినిమాపై భారీ హైప్ క్రియేట్ అవడంతో, విజయ్ కెరీర్‌లో 'రణబాలి' ఒక మైలురాయిగా నిలుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.



# నాల్గవ హీరోను పరిచయం చేయనున్న శ్రీలీల..!

శ్రీలీల గత ఏడాది మూడు సినిమాలతో వచ్చింది. అందులో జూనియర్ కాస్త పర్వాలేదు అనిపించినా మిగిలిన సినిమాలు ఆమెకు తీవ్రంగా నిరాశను మిగిల్చాయి. దాంతో శ్రీలీల పని అయిపోయిందని కొందరు సోషల్ మీడియాలో కామెంట్స్ చేశారు. ఈ ఏడాది ఆరంభంలో పరాశక్తితోనూ ఫ్లాప్‌ను చవిచూసిన శ్రీలీలకి ఉస్తాద్ భగత్ సింగ్‌తో కాస్త ఊరట దక్కిందని చెప్పాలి. ప్రస్తుతం టాలీవుడ్‌లో శ్రీలీల చేస్తున్న సినిమాలు ఏంటి అంటే ఠక్కున చెప్పే పరిస్థితి లేదు. ఎందుకంటే ఆమె ఒకటి రెండు సినిమాలకు పరిశీలిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. కానీ ఇప్పటి వరకు ఆమె సినిమాను కన్ఫర్మ్ చేయలేదు. మరో వైపు బాలీవుడ్‌లో అనురాగ్ బసు దర్శకత్వంలో రూపొందుతున్న ఒక సినిమాలో నటిస్తోంది. ఆ సినిమాలో హీరోగా కార్తీక్ ఆర్యన్ నటిస్తున్నాడు. త్వరలోనే ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

ఈ సమయంలో నందమూరి మోక్షజ్ఞ హీరోగా వశిష్ట దర్శకత్వంలో రూపొందబోతున్న సినిమాలో హీరోయిన్‌గా శ్రీలీల ఎంపిక అయిందనే వార్తలు వస్తున్నాయి. మైత్రి మూవీ మేకర్స్ వారు తాజాగా ఆమెతో చర్చలు జరిపారనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. బాలకృష్ణ సూచన మేరకు మోక్షజ్ఞకు జోడీగా శ్రీలీలను హీరోయిన్‌గా ఎంపిక చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ మధ్య కాలంలో మోక్షజ్ఞ సినిమాపై భారీ హైప్ క్రియేట్ అయిన విషయం తెల్సిందే. దాంతో హీరోయిన్ ను సైతం అదే స్థాయిలో బాలీవుడ్ నుంచి దించుతారని అంతా భావించారు. కానీ బాలకృష్ణ ఈ సినిమా కోసం శ్రీలీల అయితే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం చేయడంతో దర్శకుడు వశిష్ట లుక్ టెస్ట్‌కి రెడీ అయ్యాడని తెలుస్తోంది. మోక్షజ్ఞ, శ్రీలీలపై లుక్ టెస్ట్ చేయడంతో పాటు, కొన్ని సీన్స్ సైతం షూట్ చేసి పరిశీలించే అవకాశాలు ఉన్నాయని సమాచారం అందుతోంది. మోక్షజ్ఞ మొదటి సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తే అరుదైన రికార్డ్ ఆమె సొంతం అవుతుంది. ఇప్పటి వరకు ముగ్గురు హీరోలను శ్రీలీల ఇండస్ట్రీకి పరిచయం చేసింది. కన్నడ హీరో విరాట్ మొదటి సినిమా 'కిస్'. ఆ సినిమాలో హీరోయిన్‌గా శ్రీలీల నటించింది. కిస్ హీరో విరాట్ కి, శ్రీలీలకు మొదటి సినిమా కావడం విశేషం. ఆ తర్వాత రోషన్ మేకా హీరోగా పరిచయం అయిన 'పెళ్లి సందడి' సినిమాలోనూ శ్రీలీల హీరోయిన్‌గా నటించింది. టాలీవుడ్‌లో శ్రీలీలకు అదే మొదటి సినిమా. రోషన్ మేకా మొదటి సినిమాకు శ్రీలీల సరైన జోడీ అనే అభిప్రాయంతో రాఘవేంద్ర రావు ఆమెను ఏరికోరి ఎంపిక చేశాడని అంటారు. ఆ తర్వాత కన్నడం నుంచి వచ్చిన కిరీటి రెడ్డి మొదటి సినిమా 'జూనియర్' లోనూ శ్రీలీల హీరోయిన్‌గా నటించిన విషయం తెల్సిందే. ఈ ముగ్గురు హీరోల మొదటి సినిమాల్లో శ్రీలీల హీరోగా నటించడం జరిగింది.



# మహేంద్రగిరి వారాహిని మురారితో పోల్చొద్దు: సుమంత్

డివోషనల్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కిన మహేంద్రగిరి వారాహి మూవీపై హీరో సుమంత్ ఫుల్ నమ్మకంతో ఉన్నారు. సినిమా ప్రేక్షకులకు మంచి థియేట్రికల్ ఎక్స్పీరియన్స్ ఇస్తుందని తెలిపారు. సుమంత్, ఐశ్వర్య రాజేష్ లీడ్ రోల్స్ నటించిన ఆ సినిమాకు సంతోష్ జాగర్లపూడి దర్శకత్వం వహించారు. స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ కీలక పాత్రలో కనిపించనున్నారు. రాజశ్యామల ఎంటర్టైన్మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ నిర్మించగా, సినిమా సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే తాజాగా ప్రమోషన్స్ లో భాగంగా సుమంత్ మీడియాతో మాట్లాడారు. మహేంద్రగిరి వారాహి తన కెరీర్ లో ఇటీవల వచ్చిన పెద్ద బడ్జెట్ సినిమాల్లో ఒకటని చెప్పారు. నిర్మాతలు మూవీని భారీ స్థాయిలో నిర్మించారని తెలిపారు. తెలుగు మాత్రమే కాకుండా హిందీ, తమిళ భాషల్లో కూడా రిలీజ్ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వచ్చిందని, ప్రేక్షకుల రెస్పాన్స్ చూసి సినిమాపై నమ్మకం మరింత పెరిగిందని అన్నారు దర్శకుడు సంతోష్ జాగర్లపూడి కథను సింగిల్ సిట్టింగ్ లో చెప్పారని సుమంత్ తెలిపారు.



కథ మొత్తం తనకు నచ్చిందన్న ఆయన.. ముఖ్యంగా ఇంటర్వెల్, ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్ ఎపిసోడ్స్ ప్రేక్షకులకు ఓ రేంజ్ లో నచ్చుతాయని అంచనా వేశారు. పురాణాలపై దర్శకుడికి మంచి అవగాహన ఉందని, అందుకే కథను ఆయన అద్భుతంగా తెరకెక్కించారని ప్రశంసించారు. వీఎఫ్ఎక్స్, క్యాస్టింగ్, యాక్షన్, థియేట్రికల్ ఎక్స్పీరియన్స్.. ఇలా అన్నీ సినిమాకు కలిసొచ్చాయని చెప్పారు. సినిమాలో తాను యూట్యూబ్ లో మూఢ నమ్మకాలను ప్రశ్నించే వ్యక్తి పాత్రలో కనిపిస్తానని సుమంత్ వెల్లడించారు. అయితే తన రోల్ కు సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పుడే చెప్పలేనన్న ఆయన.య డివోషనల్ యాక్షన్ థ్రిల్లర్ గా ఉండటంతో పాటు మంచి ఫ్యామిలీ డ్రామా, కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా సినిమాలో ఉన్నాయని చెప్పారు. సిద్ధు జొన్నలగడ్డ సినిమాలో సీరియస్ రోల్ లో కనిపిస్తారని రివీల్ చేశారు. తమ మధ్య వచ్చే ఓ సీన్ సినిమాకు స్పెషల్ అట్రాక్షన్ గా నిలుస్తుందని చెప్పారు. ఆ సీన్ చూసిన వారంతా చాలా బాగా వచ్చిందని చెప్పారని, సినిమాలో సిద్దు రోల్ బాగుంటుందని అన్నారు. ఆ రోల్ కు ఓకే చెప్పినందుకు సిద్ధుకు థ్యాంక్స్ చెప్పారు. ట్రైలర్ లో 33 ఏళ్లు దాటిన తర్వాత ఓ వంశానికి చెందిన వ్యక్తులు చనిపోతున్నట్లు చూపించడంతో మురారి సినిమా గుర్తుకొస్తుందని సుమంత్ చెప్పారు. అయితే రెండు సినిమాల స్టోరీ, స్క్రీన్ ప్లే పూర్తిగా వేర్వేరుగా ఉంటాయని క్లారిటీ ఇచ్చారు. మహేంద్రగిరి వారాహి స్పెషల్ స్టోరీతో రూపొందిందన్న సుమంత్.. అనూప్ రూబెన్స్ మ్యూజిక్ సినిమాకు మెయిన్ స్ట్రెంత్ గా నిలుస్తుందని సుమంత్ చెప్పారు. కచ్చితంగా గూస్ బంప్స్ ఎక్స్పీరియన్స్ వస్తుందని అన్నారు. సినిమాలో మూడు మెయిన్ యాక్షన్ ఎపిసోడ్స్ తోపాటు మరికొన్ని యాక్షన్ బ్లాక్స్ ఉంటాయని తెలిపారు. వారాహి టైటిల్ స్టోరీ అనుకున్న సమయంలోనే రిజిస్టర్ చేశామని చెప్పిన ఆయన, పవన్ కల్యాణ్ వారాహి యాత్రతో ఆ పేరు పాపులర్ అయిందని చెప్పుకొచ్చారు.

# 'లస్ట్ స్టోరీస్ 3' ట్రైలర్ వచ్చేసింది.. ఈసారి మరింత బోల్డ్‌గా..




ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బోల్డ్ అంథాలజీ సిరీస్ 'లస్ట్ స్టోరీస్ 3' అధికారిక ట్రైలర్‌ను విడుదల చేసింది. ఆధునిక కాలంలో ప్రేమ, కోరికలు, మానవ సంబంధాల్లోని సంక్లిష్టమైన భావోద్వేగాల చుట్టూ అల్లుకున్న ఈ కథలు గత భాగాల కన్నా మరింత బోల్డ్‌గా ఉండనున్నట్లు ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది. ఈ సిరీస్ సెప్టెంబర్ 18 నుంచి హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ చేయనున్నట్లు ప్రకటించారు.

ఈ ఆంథాలజీలో నలుగురు ప్రముఖ దర్శకులు నాలుగు విభిన్నమైన లఘు చిత్రాలను తెరకెక్కించారు. విక్రమాదిత్య మోత్వానే, కిరణ్ రావ్, శకున్ బాత్రా, విశాల్ భరద్వాజ్ వంటి దిగ్గజ దర్శకులు తమదైన శైలిలో ఒక్కో కథను రూపొందించారు. దీంతో ఈ సిరీస్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక, ఇందులో కొంకణా సేన్ శర్మ, రాధికా ఆప్టే, విజయ్ వర్మ, అభిషేక్ బెనర్జీ, అలీ ఫజల్, రాధికా మదన్, అదితి రావు హైదరి, సిద్ధార్థ్ వంటి ప్రముఖ నటీనటులు ప్రధాన పాత్రల్లో నటించారు. రియల్ లైఫ్ కపుల్ నటుడు సిద్ధార్థ్, అదితి రావు హైదరీ కొన్ని రొమాంటిక్ సీన్స్‌లో నటించారు. విభిన్నమైన కథనాలతో రాబోతున్న ఈ ఆంథాలజీ సిరీస్ ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613